Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 151 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 20 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## న్యూఢిల్లీలో బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో రాష్ట్రంలో అనేక సంచలనాలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. లిక్కర్ అవినీతి మాత్రమే కాదు.. గత ప్రభుత్వం అనేక అరాచకాలు చేసిందని విమర్శించారు. అక్రమార్కులకు తప్పకుండా శిక్ష పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ట్వీట్‌పై ఏపీ చీఫ్ మాధవ్ పైవిధంగా స్పందించారు. మాధవ్ మాట్లాడుతూ.. మూడేళ్లకు ఒక్కసారి బీజేపీ జాతీయ అధ్యక్షుడు మారుతూ ఉంటారని చెప్పారు. కార్యకర్తలను గుర్తించే పార్టీ బీజేపీ అని..ఈ పార్టీకి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. నితిన్ నబీన్‌కు మద్దతు తెలుపుతూ ఏపీ బీజేపీ తరఫున రెండుసెట్ల నామినేషన్ పత్రాలు వేస్తున్నామన్నారు. మంగళవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక జరగనుం దని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో తాము ఢిల్లీకి వచ్చామని మాధవ్ వివరించారు. తామంతా కలిసి నేడు నితిన్ నబీన్‌కు మద్దతు తెలుపుతూ నామినేషన్ వేస్తామన్నారు. 20 మందితో రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేస్తున్నామని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ తెలిపారు.

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 23న వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలంటూ ఎంపీ మిథున్ రెడ్డికి జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. ఈ లిక్కర్ స్కామ్‌లో ఆయన కీలక పాత్ర పోషించారని ఈడీ అనుమానిస్తోంది. అలాగే ఈ వ్యవహారంలో హవాలా, మనీ ల్యాండరింగ్ రూపంలో భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ ఎంపీకి నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసులో మిథున్ రెడ్డి అరెస్టయ్యారు. అనంతరం ఆయన్ని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలైన విషయం విదితమే. మరోవైపు వైసీపీ మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డికి సైతం రెండ్రోజుల క్రితం ఈడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 22వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. వైసీపీ పభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై జరిగిన విచారణలో ఇప్పటికే పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ స్కామ్‌లో కీలక పాత్ర పోషించిన రాజ్ కసిరెడ్డి ఆస్తులను సైతం ప్రభుత్వానికి అటాచ్ చేశారు. అలాగే ఈ కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వారు బెయిల్‌పై బయట ఉన్నారు. ఈ స్కామ్‌లో తవ్వే కొద్ది కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అంతేకాకుండా.. ఎంపీ మిథున్ రెడ్డి ఈ కేసులో కీలక పాత్ర పోషిం చారనే ప్రచారం సాగుతోంది. దాంతో విచారణకు హాజరు కావా లంటూ ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఆ ముందు రోజే విచారణకు హాజరు కావాలంటూ విజయసాయిరెడ్డికి ఈడీ నోటీసులు ఇచ్చింది. అయితే వైసీపీతోపాటు రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

## సీఎం చంద్రబాబుతో భారత రాయబారి మృదుల్ కుమార్ భేటీ



**ఇంటర్నెట్ డెస్క్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్విట్జర్లాండ్‌లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా సీఎం పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో భారత రాయబారి మృదుల్ కుమార్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఏపీలో పెట్టుబడులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీకి మంత్రి నారా లోకేశ్ హాజర య్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. స్విట్జర్లాండ్ దేశంలోని ప్రముఖ కంపెనీల వివరాలు, పెట్టుబడుల సాధనకు ఉన్న అవకాశాలపై చర్చించామని తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేలా స్విట్జర్లాండ్ కంపెనీలతో సంప్రదింపులు జరిపేందుకు సహకరించాలని భారత రాయబారి మృదుల్ కుమా ర్‌ను కోరినట్లు వెల్లడించారు. ఫార్మా, వైద్య పరికరాలు, మిషనరీ తయారీ, హార్డ్‌వేర్ ఎలక్ట్రానిక్స్, రైల్ కంపోనెంట్స్, టెక్నిలకల్ టెక్స్ టైల్స్, ఆర్ అండ్ డీ కేంద్రాలు వంటి రంగాల్లో సహకారం కోరామని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఏపీ తెచ్చిన పాలసీలను... పారిశ్రామిక ప్రగతి కోసం తీసుకున్న నిర్ణయాలను భారత్ అంబాసిడర్‌కు వివరించారు. 2025లో చేపట్టిన దావోస్ పర్యటన సక్సెస్ అయిందని.. సుమారు రూ. 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సాకారమయ్యాయని మృదుల్ కుమార్ తెలిపారు. ఎన్నార్టీల భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధికి మరింత దోహదం చేసే విధంగా కృషి చేయాలని సీఎం సూచించారు. మధ్య యూరప్‌లోని లిచ్టెన్ స్టైన్ అనే దేశంలో జరుగుతున్న ఏఐ ప్రగతికి సంబంధించిన వివరాలను సీఎంకు వివరించారు మృదుల్ కుమార్.

**మానవ వనరుల కొరత...**

నేడు ఏ దేశానికి తాము వెళ్లినా భారతీయుల విజయాలు గర్వకారణంగా ఉంటున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. నేడు ప్రపంచంలో అనేక దేశాలు మానవ వనరుల కొరతతో ఉన్నాయని తెలిపారు. భారతదేశం యువశక్తితో సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. ప్రపంచ మానవ వనరుల కొరతకు సమాధానం భారతదేశంలోనే లభిస్తుందని తెలిపారు. లిచ్టెన్ స్టైన్ వంటి దేశంలో ఏఐ పురోగతి ఆసక్తిదాయకంగా ఉందని వివరించారు. ఫిబ్రవరిలో భారతదేశంలో జరిగే ఏఐ సదస్సులో లిచ్టెన్ స్టైన్ దేశ ప్రతినిధులతో సమావేశమవుతానని వెల్లడించారు. ప్రకృతి సేద్యంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి సహకరించాలి: మంత్రి నారా లోకేశ్**

స్విట్జర్లాండ్ దేశంలోని ఫార్మా కంపెనీలు, యూనివర్సిటీలు ఏపీకి రావడానికి ఇక్కడి ప్రతినిధులు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. వివిధ కంపెనీలతో ఏపీని కనెక్ట్ చేసేందుకు భారత రాయబారి సహకరించాలని సూచించారు. వివిధ రంగాలకు చెందిన కంపెనీలకు అవసరమైన మ్యాన్ పవర్‌ను సప్లై చేసేందుకు ఏపీ సన్నద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. యువతకు నైపుణ్యంలో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. వంద కేజీల బరువు మోసే డ్రోన్లు తయారు చేసే కంపెనీలు ఉన్నాయని... వాటిని కనెక్ట్ చేస్తామని తెలిపారు. బీ టు బీ ద్వారా ఈ పెట్టుబడులను సాకారం చేద్దామని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

## వేమన నీతి సూత్రాలు సమాజానికి అనుసరణీయం: సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రజాకవి, సామాజిక సంస్కర్త యోగి వేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యోగి వేమనకు ఘన నివాళులర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. వేమన తన పద్యాల ద్వారా కులమత భేదాలు, మూఢ నమ్మకాలను పారద్రోలిన కృషిని ప్రశంసించారు. 'విశ్వదాభిరామ వినురవేమా' అనే నీతి సూత్రాలు ఈనాటి సమాజానికి మార్గదర్శకమని, ఆయన బోధనలు అనుసరణీయమని చంద్రబాబు కొనియాడారు.

**చంద్రబాబు ట్వీట్..**

'ప్రజాకవి, సామాజిక సంస్కర్త యోగి వేమన జయంతి సందర్భంగా ఆయనకు ఘననివాళి అర్పిస్తున్నాను. కులమత భేదాలు, మూఢ నమ్మకాలను పారద్రోలేందుకు యోగి వేమన తన పద్యాల ద్వారా చేసిన కృషి ఈనాటి సమాజానికి ఎంతో ఉపయుక్తం. విశ్వదాభిరామ వినురవేమా అంటూ ఆయన చెప్పిన నీతి సూత్రాలు అనుసరణీయం. అలాంటి మహనీయుడి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడమంటే మనల్ని మనం సన్మార్గంలో నడిపించుకోవడమే' అని ట్వీట్‌లో రాసుకొచ్చారు సీఎం. మరోవైపు.. వేమన జయంతి సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని వేమన సమాధి వద్ద రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. వేలాది మంది విద్యార్థులు ఒకేసారి యోగి వేమన పద్యాలను పఠించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. యోగి వేమన జయంతి కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

## శ్రీపంచమి వేళ విద్యార్థులకు గుడ్ న్యూస్.. జస్ట్ చిన్న కండిషన్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** పర్వదినాల మాసం.. మాఘ మాసం. జనవరి 23న మాఘ శుద్ధ పంచమి. ఈ శ్రీ పంచమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు భక్తులకు శ్రీ దుర్గమ్మవారు సరస్వతీ దేవి రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. దీంతో ప్రధాన ఆలయంలో అమ్మవారి మూల స్వరూపానికి ప్రత్యేక అలంకరణతో పాటు, మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇక.. ఆరో అంతస్తులో దాదాపు 500 మంది విద్యార్థులకు ఉచిత సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే.. యాగశాలలో శ్రీ సరస్వతీ హోమం సహా పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శ్రీ పంచమి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సరస్వతీ దేవి రూపంలో అమ్మవారిని విద్యార్థులు ఉచిత దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం విద్యార్థులకు పెన్ను, శక్తి కంకణం, అమ్మవారి ఫొటోతో పాటు 40 గ్రాముల లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందజేస్తామని దేవస్థానం ఉన్నతాధికారులు వెల్లడించారు. శుక్రవారం




వచ్చే ఈ వసంత పంచమి రోజున.. స్కూల్ యూనిఫామ్ ధరించి, గుర్తింపు కార్డుతో వచ్చే విద్యార్థులకే ఉచిత దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారులు వివరించారు. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీ పంచమి వేళ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో అమ్మవారు సరస్వతీ రూపంలో దర్శనమివ్వనున్నారు. ఇక బాసర (నిర్మల్ జిల్లా), వర్గల్ (సిద్ధిపేట జిల్లా) దేవాలయాలకు సైతం భక్తులు పోటెత్తనున్నారు. మరోవైపు.. నేటి నుంచి అంటే సోమవారం నుంచి శ్యామలా నవరాత్రులు ప్రారంభమయ్యాయి.

## ఉన్నావ్ అత్యాచార కేసులో హైకోర్టు కీలక తీర్పు



**ఢిల్లీ :** 2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన సంచలనాత్మక అత్యాచార కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ వేసిన పిటిషన్ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. తనకు విధించిన పదేళ్ల జైలుశిక్షను నిలిపి వేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో సెంగార్ పిటిషన్ వేశాడు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ఢిల్లీ న్యాయస్థానం.. ఆ పిటిషన్ను కొట్టివేసింది. 'రిలీఫ్ మంజూరు చేయడానికి నిందితుని తరపు న్యాయవాదులు ఎలాంటి కారణాలూ చూపలేదు. శిక్షను నిలిపివేయాలని కోరుతూ దాఖలు చేసిన వాజ్యాన్ని తిరస్కరిస్తున్నాం' అని జస్టిస్ రవీందర్ దుడేజా స్పష్టం చేశారు. ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసులో ట్రయల్ కోర్టు 2020 మార్చి 13న సెంగార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధించింది. ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని హతమార్చినందుకు దోషి విషయంలో ఎలాంటి సానుభూతీ చూపలేమని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో కుల్దీప్ సెంగార్ సోదరుడు అతుల్ సింగ్ సెంగార్‌తో పాటు మరో ఐదుగురికీ పదేళ్ల జైలు శిక్ష విధించింది న్యాయస్థానం. సెంగార్ అండతో పోలీసులు.. బాధితురాలి తండ్రిని హింసించారు. చివరకు ఆయన.. 2018 ఏప్రిల్ 9న మరణించాడు. ఈ అత్యాచార కేసులో నిందితునికి జీవితాంతం జైలుశిక్ష విధించిన డిసెంబర్ 2019 నాటి తీర్పునకు వ్యతిరేకంగా.. అలాగే బాధితురాలి తండ్రి కేసులోనూ సెంగార్ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అత్యాచార కేసులో తనపై విధించిన శిక్ష, తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉండటంతో 2025 డిసెంబర్ 23న హైకోర్టు సెంగార్ శిక్షను నిలిపివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సీబీఐ స్పెషల్ లీవ్ పిటిషన్ను దాఖలు చేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ పేర్కొంది. ఈ పిటిషన్‌ను 2025 డిసెంబర్ 29న విచారించిన సుప్రీం న్యాయస్థానం.. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపి వేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది.

**ఇదీ ఘటన..**

ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17ఏళ్ల ఓ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, నాటి బీజేపీ నేత కుల్దీప్ సెంగార్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తేలాడు. అయితే.. ఈ కేసు విచారణలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2018లో ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టింది. ఆ తర్వాత యూపీ ట్రయల్ కోర్టు, ఢిల్లీ కోర్టులకు మారింది. 2019 డిసెంబర్‌లో కుల్దీప్ దోషిగా తేలడంతో అతనిపై జీవితఖైదు విధించింది న్యాయస్థానం.

# వాసవి 768 క్లబ్ ప్రెసిడెంట్‌గా నూతనంగా ఎన్నికైన అర్వపల్లి వెంకట అప్పారావు

## - ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్షులు దూండీ రాకేష్





**చిలకలూరిపేట, (రాజధాని వార్తలు):** పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం చిలకలూరిపేట పట్టణం శ్రీ వాసవి కన్యకాపర మేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో చిలకలూరిపేట ఆర్యవైశ్య కళ్యాణ మండపంనందు ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్షులు దూండీ రాకేష్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ 768 క్లబ్ ప్రెసిడెంట్‌గా నూత నంగా ఎన్నికైన అర్వపల్లి వెంకట అప్పారావుని సాదరంగా వాసవి క్లబ్ 768 క్లబ్‌కు ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షులు దూండీ రాకేష్ వాసవి క్లబ్ 768 క్లబ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన అర్వపల్లి వెంకట అప్పారావు మాట్లాడుతూ మాకు ఈ అవకాశాన్ని కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దూండీ రాకేష్‌కి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మాకు ఈ సదవకాశం కల్పించినందుకు మన చిలకలూరిపేట నందు ఉన్న ఆర్యవై శ్యులకు అండగా ఉంటూ, వాసవి క్లబ్ 768 క్లబ్ సభ్యులకు మన ఆర్యవైశ్య మిత్రుల అందరికీ నా వంతు సహాయ సహకారాలు చేకూరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కనమర్లపూడి రమేష్, కొత్త కోటేశ్వరరావు, రాచుమల్లు సూర్యారావు, చేవూరి కృష్ణమూర్తి, రాచుమల్లు శ్రీనివాసరావు, దివ్వెల రంగనాథ్, అర్వపల్లి నాగేశ్వరరావు, చిలకల బాలాజీ, శ్రీరామ్ నారాయణ, మద్ది శ్రీనివాసరావు తదితరులు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# విశ్వ శాంతి స్థాపనకు బ్రహ్మ బాబా మహా యజ్ఞం

## - దేదీప్యమానంగా 57వ పుణ్య స్మృతి దివస్ - బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశ్వశాంతి స్థాపన కోసం రాజస్థాన్ ఆరావలి పర్వతాలపై ఈశ్వరీయ విశ్వవిద్యా లయం నెలకొల్పిన ఘనత పితాశ్రీ బ్రహ్మ బాబాదేనని హిందుస్థాన్ షిప్ యార్డ్ పూర్వపు సీఎం డి హేమంత్ కత్రి కొనియాడారు. శనివారం బ్రహ్మ బాబా 57వ పుణ్య స్మృతి దివస్ కార్యక్రమం డాబాగార్డెన్స్ వి జె ఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ప్రజాపిత బ్రహ్మ కుమరీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు హిందు స్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ పూర్వపు సీఎం డి ఫార్మర్ ఇండియన్ నేవల్ ఆఫీసర్ కమాండో హేమంత్ కత్రి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా తొలుత అతిథులు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరము చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరింప చేశాయి. ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మ కుమారీష్ బ్రహ్మకుమారి సోదరి బి కె రామేశ్వరి మాట్లాడుతూ 1969 జనవరి 18న బ్రహ్మ బాబా తన సంపూర్ణ స్థితికి చేరుకొని అవ్యక్తం అయ్యారని నాటినుంచి పితాశ్రీ బ్రహ్మ బాబా అడుగు జాడల్లో నడుస్తూ బ్రహ్మకుమారి కుమారులందరూ పవిత్ర జీవితా లను పరమేశ్వరునికి సర్వస్వము సమర్పించి మానవత్వ సేవలను చేయుచు సంస్కార పర్వతం చేస్తూ సత్య నీతివంతులై పరోపకారులై విశ్వ కల్యాణంలో భాగస్వాములుగా నిలిచారన్నారు. అనంతరం ముఖ్య అతిథి హేమంత్ కత్రి మాట్లాడుతూ బ్రహ్మ బాబా యొక్క చరిత్రను తెలుసుకున్న వారే పవిత్రమైన బ్రహ్మవిద్యను అభ్యసిం చగలుగుతారన్నారు. కలియుగ మానవులు పవిత్ర దివ్య గుణాలు కలిగి ఉండే దేవాత్ములుగా పరివర్తన అయ్యే లక్ష్యసాధనలో లక్ష లాది మంది ఈ సన్మార్గమును అనుసరిస్తున్నారన్నారు. జీవితాన్ని పరివర్తన చేసే ప్రజాపిత బ్రహ్మ బాబా అద్భుత జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదివి తెలుసుకొని భగవంతుని భగవంతుడైన పరమాత్మ తండ్రిని గుర్తించి దుర్గులను వదిలి సత్ప్రవర్తన పరులై సన్మార్గంలో నడుస్తూ ఒక నూతన ప్రపంచ నిర్మాణం అప్పుడే చేయగలుగుతారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు జాతీయ జర్నలి స్టులు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కార్యక్రమాన్ని ఉ ద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రజాపిత బ్రహ్మకుమారిల ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్నటువంటి బ్రహ్మ బాబా పుణ్యాస్మృతి కార్యక్ర మంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని, అదేవిధంగా బ్రహ్మకుమారిస్ తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో నేను భాగస్వా మ్యం అవడం ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. అదేవిధం గా ప్రజాపిత బ్రహ్మ బాబా అద్భుత జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదివి తెలుసుకోవాలన్నారు. భగవంతుడైన పరమాత్మ తండ్రిని గుర్తించి దుర్మార్గాలను దుర్వేశనాలను వదిలి సత్ప్రవర్తన పరు లయి, సన్మార్గంలో నడవాలని ప్రతి ఒక్కరు నడుస్తూ ఒక నూతన ప్రపంచం నిర్మించుకోవాలన్నారు. అనంతరము పలువురుని బ్రహ్మకుమారిష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు సోమేశ్వరీ రత్నకు మారి స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ నిర్వహకులు సీనియర్ పాత్రికే యులు ఆర్ నాగరాజు పట్నాయక్ తదితరులు బ్రహ్మ బాబాపై ప్రసంగించారు.

# కుంభమేళాను తలపించిన సరస్ మేళా : ప్రత్తిపాటి





**గుంటూరు, (రాజధాని వార్తలు):** గుంటూరులోని సరస్ (అజీవిక) మేళాను సందర్శించి, డ్వాక్రా ఉత్పత్తుల విక్రేతలతో మాట్లాడిన మాజీమంత్రి ప్రత్తిపాటి. ఉత్తరాదిన భారీఎత్తున నిర్వహించే కుంభమేళాకు ఏమాత్రం తీసిపోని విధంగా గుంటూరులో ఏర్పాటు చేసిన సరస్ మేళా విజయవంతం అయిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. కేంద్ర మంత్రి, గుంటూరు పార్లమెంట్ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ కృషి, ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనల వల్లే ఆల్ ఇండి యా డ్వాక్రా బజార్ గుంటూరుకు తరలివచ్చిందని ఆయన తెలి పారు. ఆయన గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, స్థానిక కూటమి నాయకులతో కలిసి హౌసింగ్ బోర్డ్ వద్ద ఏర్పాటు చేసిన సరస్ మేళాను సందర్శించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వివిధ రకాల ఉ త్పత్తుల్ని పరిశీలించిన ఆయన.. వాటి తయారీ, నాణ్యత, ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్నాక్స్ తిని, టీ తాగారు. బయటకు వచ్చిన అనంతరం విలేకరులతో మాట్లా డారు. వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు... నాణ్యమైన తమ ఉత్పత్తుల్ని తక్కువ ధరకే సరస్ మేళాలో అందుబాటులో ఉంచారని ప్రత్తిపాటి చెప్పారు. పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో వివిధ రకాల ఉత్పత్తులు దాదాపు 500 స్టాళ్లలో ఏర్పాటు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల డ్వాక్రా, మెప్మా మహిళల పనితీరు, ఉత్పత్తుల గురించి ఈ రాష్ట్రంలోని వారు తెలుసుకోవడం.. ఇక్కడి ఉత్పత్తులపై వారు అవగాహన పెంచుకోవడం వల్ల స్వయం సహాయక సంఘాల వ్యవస్థ మరింత బలోపేతమవుతుందన్నారు. తొలిరోజు నుంచి ఇప్పటివరకు సరస్ మేళాను 12 లక్షల మంది సందర్శించినట్టు నిర్వాహకులు చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. స్వయం సహాయక సంఘాలను నెలకొల్పిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కు తుందని, ఆయన మానసపుత్రికలైన డ్వాక్రా, మెప్మా సంఘాలు జాతీయస్థాయిలో పేరు ప్రతిష్టలు పొందడం నిజంగా గర్వించా ల్సిన విషయమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. సరస్ మేళాను సందర్శించిన ప్రత్తిపాటి వెంట.. టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, పట్టణ మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్ పనులను త్వరగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్



**బాపట్ల, (రాజధాని వార్తలు):** మార్టూరు నగరం, సంపత్ నగర్లో చివరి దశకు చేరుకున్న అన్న క్యాంటీన్ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి, కార్మిక వర్గ ప్రజలకు, చిరు ఉద్యోగులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికా హారాన్ని అతి తక్కువ ధరకే అందించాలనే సంకల్పంతో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుందని ఆయన చెప్పారు. మార్టూరు నగరం, సంపత్ నగర్‌లోని సర్వే నంబర్ 600/సి లోని 30 సెంట్ల కమ్యూనిటీ స్థలంలో అన్న క్యాంటీన్ కొరకు 5 సెంట్ల స్థలాన్ని కేటాయించి పనులు చేపట్టడమైనదని, పనులు చివరి దశకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. ఈ అన్న క్యాంటీన్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానం ద్వారా త్వరలో ప్రారంభిస్తారని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుపై నగర ప్రజల స్పందనను ఆయన తెలుసు కున్నారు. అన్న క్యాంటీన్ పక్కనే ఉన్న పరిసరాలను ఆయన పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎంఎస్ఎమ్ఈ పార్కుల ఏర్పాటుకు మార్టూరు మండలం నాగరాజు పల్లెలో నిర్దేశించిన స్థలమును జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరిశీలించారు. నాగరాజు పల్లెలోని సర్వేనెంబర్ 445, 453, 476 లోని 85 ఎకరాల అసైన్మెంట్ భూమిని ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు నిర్దేశించినట్లు ఆ స్థలాన్ని మ్యాప్ ద్వారా మార్టూరు తాహసిల్దారు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ముందుగా నిర్దేశించిన సర్వే నెంబర్ 475లోని 53 ఎకరాల ప్రభుత్వ కొండ పోరంబోకు స్థలాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పరిశీలించారు. ఆ స్థల వివరాలను మ్యాప్ ద్వారా తాహాసిల్దార్ కలెక్టర్‌కు వివరించారు. మొదటగా ఎంఎస్ ఎంఈ పార్క్ ఏర్పాటుకు నిర్దేశించిన ఈ స్థలాన్ని కాకుండా మరొక స్థలాన్ని ప్రతిపాదనకు గల కారణాలపై జిల్లా కలెక్టర్ తహసిల్దార్ని ఆరా తీశారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు మొదటగా నిర్దేశించిన సర్వే నెంబర్ 475, రెండోసారి నిర్దేశించిన సర్వే నెంబర్ 445, 453, 476 లలో ఏ ప్రదేశంలో ఎం ఎస్ ఎం ఈ పార్కు ఏర్పాటుకు సాధ్య,సాధ్యం పరిశీలించి నివేదిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి, మార్టూరు తహసిల్దార్‌లను ఆదేశించారు. చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, మార్టూరు తాహాసిల్దార్ ప్రశాంతి, మండల సర్వేయర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలులో జనవరి 20న శ్రీగిరి గిరి ప్రదక్షిణ

## - పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ విజ్ఞప్తి





**ఒంగోలు, (రాజధాని వార్తలు):** మాఘ శుద్ధ విదియ, జనవరి 20వ తేదీ మంగళవారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత భక్తియుతంగా శోభాయ మానంగా జరుగుతుందని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ దయం 5 గంటలకు శ్రీగిరి పాదపీఠం వద్ద గల శ్రీ బాపూజీ గోశాల వద్ద గోపూజ నిర్వహించుకుని సామూహికంగా గోవింద నామస్మరణ చేస్తూ సుందరంగా అలంకరించిన పల్లకిలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్లను ప్రతిష్ట చేసి భక్తులు తమ బుజస్కంధాలపై మోస్తూ శ్రీ గిరి గిరి ప్రదక్షిణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుచూ ప్రపంచానికి త్యాగం ప్రేమ అహింస సహకారం వంటి భావాలను నేర్పిన త్రిశక్తి స్వరూపిణి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఈ మాఘశుద్ధ విదియ నాడు జరగడం, ఇంతటి మహిమాన్వితమైన రోజు సామూహిక గిరి ప్రదక్షిణ చేసి స్వామివార్ల కృపకు పాత్రులు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. బంధుమిత్రులు సకుటుంబ సపరివార సమేతంగా గిరిప్రదక్షిణలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు.

# చిలకలూరిపేటలో సమర్థ్ చేనేత ట్రైనింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం

## - ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ సాహు

## - చిలకలూరిపేటలో చేనేతలకు ఉచితంగా సమర్థ్ చేనేత కార్యక్రమం ప్రారంభం



**చిలకలూరిపేట, (రాజధాని వార్తలు):** చిలకలూరిపేట భావన ఋషి నగర్‌లో చేనేత సమర్థ్ ట్రైనింగ్ ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ సాహు (సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసర్) ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ చేనేతలకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా స్కీంలు ప్రవేశపెట్టి 15% నుంచి 100% వరకు సబ్సిడీ చేనేతలకు అందిస్తున్నది చేనేతలకు వృత్తి నైపుణ్యం పెంపొందించి వాళ్ళ అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు ట్రైనింగ్ 40 రోజులు జరుగుతునదని ట్రైనింగ్ అనంతరం వాళ్లకి ట్రైనింగ్ సర్టిఫికెట్స్‌తో పాటు వారికి 90% సబ్సిడీతో పరికరాలను అంది స్తారు, 15% సిల్క్ అండ్ కాటన్ యారన్ ఇవ్వనున్నట్లు తెలియ జేశారు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత చేనేత ముద్ర రుణాలను అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వివర్స్ సర్వీస్ సెంటర్ టెక్నికల్ సూపర్నెంట్ బి స్వజిత్, డి ఓ ఉమామహేశ్వరరావు, వివర్స్ సర్వీస్ సెంటర్ జూనియర్ రామ నాథం శ్రీను, సిడి మురళి బిజెపి చిలకలూరిపేట ప్రధాన కార్యదర్శి సింగిరేసు పోలయ్య మరియు కూటమి నాయకులు చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనెమలి గుండ్ల రంగనాయక స్వామిని దర్శించుకున్న భక్తులు





**రాచర్ల, (రాజధాని వార్తలు):** రాచర్ల మండలంలోని జెపుల్లలచెరువు గ్రామానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీనెమలి గుండ్ల రంగనాయక స్వామిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర జిల్లాల నుండి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ ఈవో నాగయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. గిద్దలూరు మార్కాపురం కనిగిరి పొదిలి డిపో నుండి ఆర్టీసీ వారు బస్సులు ఏర్పాటు చేశారు.
వచ్చిన భక్తులకు వివిధ అన్నసత్రాలలో అన్నదాన సౌకర్యం కలదు.

# హత్యా రాజకీయాలకు పుట్టిల్లు వైసీపీ.. ఆద్యుడు జగన్



**చిలకలూరిపేట, (రాజధాని వార్తలు):** ప్రశాంతమైన పల్నాడు జిల్లాను హత్యలు, దురాగతాలు, దోపిడీల కేంద్రంగా మార్చింది జగన్ కాదా? తన ప్రభుత్వంలో పల్నాడులో జరిగిన దారుణాలపై ముఖ్యమంత్రిగా ఏనాడైనా జగన్ స్పందించారా? టీడీపీ నేతలు బొండా ఉమా, బుద్దా వెంకన్నలపై హత్యాయత్నం జరిగినప్పుడు జగన్‌కు ప్రజాస్వామ్యం శాంతిభద్రతలు గుర్తురా లేదా? హత్యా రాజకీయాలకు పుట్టిల్లు వైసీపీ.. ఆద్యుడు జగన్మోహన్ రెడ్డి. ప్రశాంతమైన పల్నాడు పల్లెల్లో నెత్తుటి ఏర్లు పారించింది వైసీపీ ప్రభుత్వం కాదా? ఆత్మకూరు దళిత కుటుంబాలపై తన పార్టీ నాయకులు సాగించిన దమనకాండను జగన్ మర్చిపోయారా? చంద్రబాబు తలపెట్టిన ఛలో ఆత్మకూరు పర్యటనకు వెళ్లకుండా నాడు ఆయన ఇంటి గేట్లకు తాళ్లు కట్టి మరీ ఎందుకు అడ్డుకోవడం ఏ విధమైన ప్రజాస్వామ్యమో జగన్ సమాధానం చెప్పాలి. తోట చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతు కోసినప్పుడు జగన్‌కు ప్రజాస్వామ్యం స్ఫురించలేదా? ఎన్నికల వేళ తన పార్టీ ఎమ్మెల్యే ఈవీఎమ్‌లు పగలగొట్టి, టీడీపీ ఏజెంట్ పై వీరంగం వేసినప్పుడు జగన్‌కు శాంతిభద్రతలు, ప్రజల యోగక్షేమాలు కనిపించలేదా? అధికారంలో ఉన్నప్పుడు నియంత్రత్వం.. ఫ్యాక్షనిజాన్ని అమితంగా ఆదరించి, ప్రజాస్వామ్యానికి...రాజ్యాంగ విలువలకు పాతరేసే జగన్‌కు.. నేడు ప్రజలు ఛీ కొట్టాక అవి గుర్తుకురావడం విడ్డూరంగా ఉంది. అధికారం కోసమే అమాయకుల్ని బలి చేయడం జగన్ అనాది నుంచి సాగిస్తున్న రాజకీయ ఎత్తుగడే రెండు కుటుంబాల మధ్య జరిగిన హత్యను ప్రభుత్వానికి, చంద్రబాబుకు అంటగట్టే జగన్ కుటిల రాజకీయాల్ని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వాగతించరు. వైసీపీ నేతలు శవరాజకీయాల కోసమే బయటకు వస్తారని ఇప్పటికే ప్రజలకు అర్థమైంది. కులాల కుంపట్లు, మత విద్వేషాలు వైసీపీ రాజకీయ సిద్ధాంతాల్లో ప్రధాన అధ్యాయం అని కూడా వారికి తెలిసొచ్చింది. అధికారమే లక్ష్యంగా అమాయకుల్ని బలిచేయడం జగన్ అనాదినుంచి సాగిస్తున్న రాజకీయ ఎత్తుగడే. తన హయాంలో దురుద్దేశం.. ఆధిపత్యం.. అక్కసుతో పల్నాడులో జరిగిన రాజకీయ హత్యలకు ముమ్మాటికీ జగనే బాధ్యుడు. ఆనాడు తన దుర్మార్గ పాలనతో సర్వం కోల్పోయి రోడ్డునపడిన కుటుంబాలకు ముందు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలి." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన దర్శకుడు ఎం.వి.సతీష్ కుమార్






**పిఠాపురం, (రాజధాని వార్తలు):** పిఠాపురం మండలం, విరవాడ గ్రామానికి చెందిన దర్శకుడు ఎం.వి.సతీష్ కుమార్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినిలో నిర్వహించిన 7వ అంతర్జాతీయ సంస్కృత లఘు చలనచిత్రోత్సవం-2026లో ఆయన దర్శకత్వంలో రూపొందిన సంస్కృత షార్ట్ ఫిల్మ్ అస్తేయంకు ద్వితీయ స్థానం లభించింది. ఉజ్జయినిలోని విక్రమాదిత్య భవన్‌లో జరిగిన ఈ ఉత్సవాన్ని సంస్కృత భారతి నిర్వహించింది. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలతో పాటు అమెరికా నుంచి కూడా పాల్గొనడం విశేషం. మొత్తం 90 ఎంట్రీలు రాగా, అందులో 20 రీల్స్ విభాగంకు చెందినవి. వివిధ విభాగాల్లో 30 బహుమతులు ప్రదానం చేశారు. సంపూర్ణంగా సంస్కృత భాషలో రూపొందిన "అస్తేయం" చిత్రం కథా ప్రవాహం, భావవ్యక్తీకరణ, సంస్కృత భాషను సులభంగా ప్రజలకు చేరువ చేసే విధానంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. అంతర్జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం ద్వారా ఈ చిత్రం మాత్రమే కాకుండా, దర్శకుడి స్వగ్రామం విరవాడ పేరు కూడా జాతీయ స్థాయిలో వినిపించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు బాలయోగి ఉమేశ్‌నాథ్ మహారాజ్ మాట్లాడుతూ భారతీయ భాషలు, సంస్కృతి పరిరక్షణకు ఇలాంటి ఉత్సవాలు అవసరమని, ముఖ్యంగా సంస్కృతాన్ని కొత్త తరానికి చేరవేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నటి ఐశ్వర్య శర్మ మాట్లాడుతూ సంస్కృతం క్లిష్టమైన భాష అన్న అపోహ తప్పని, సరైన విధానంలో అందిస్తే ఎవరైనా నేర్చుకుని ఆస్వాదించగలరని వ్యాఖ్యానించారు. ఈ చిత్రంలో నటించిన కె.లలితకు ఉత్తమ నటి అవార్డు లభించడం మరో విశేషం. చిత్రాన్ని ఏకదంత నిర్మాణ సంస్థ నిర్మించగా, నిర్మాతగా మేడూరి విష్ణు వర్ధన్ రెడ్డి వ్యవహరించారు. రచన సహకారం ఆచార్య సి.హెచ్. సద్గుణ అందించారు. గతంలో కూడా అనేక అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో అవార్డులు అందుకున్న ఎం.వి.సతీష్ కుమార్, హైదరాబాద్ కేంద్రంగా తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేస్తూ ఖర్జూరం, మిక్చర్ పొట్లం వంటి చిత్రాలతో పాటు మొత్తం నాలుగు సినిమాలకు దర్శకత్వం వహించారు. అలాగే ఏకదంత - ద స్కూల్ ఆఫ్ ఏన్షియంట్ స్టడీస్ సంస్థకు ఫౌండర్ & డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. విరవాడ గ్రామానికి చెందిన ఓ దర్శకుడు సంస్కృత సినిమాతో అంతర్జాతీయ వేదికపై నిలవడం పిఠాపురం మండలానికి గర్వకారణమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేట్ బస్సుల అధిక ఛార్జీలపై కఠిన చర్యలు







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో, ప్రైవేట్ బస్సులు అధిక ఛార్జీలు వసూలు చేయకుండా నియంత్రించేందుకు ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ కఠిన చర్యలు చేపట్టిందని విశాఖపట్నం జిల్లా ఉప రవాణా కమీషనర్ తెలిపారు. గత ఆరు రోజులుగా ఆర్‌టిజిఎస్ పర్యవేక్షణతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన Fare Monitoring Teams ద్వారా అన్ని ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫార్మ్‌లు (అభిబస్, రెడ్‌బస్ తదితర యాప్‌లు) లో బస్సు ఛార్జీలను నిరంతరం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అధిక ఛార్జీలు గుర్తించిన వెంటనే సంబంధిత ప్రైవేట్ బస్సు యజమానులతో సమన్వయం చేసి, ఛార్జీలను తక్షణమే తగ్గించే చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ నిర్దేశించిన ఛార్జీలపై గరిష్టంగా 50 శాతం మాత్రమే అదనంగా వసూలు చేయాల్సిందిగా స్పష్టం చేస్తూ, దానికంటే ఎక్కువ ధరకు టికెట్లు విక్రయిస్తే సంబంధిత బస్సు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా 24ఐ7 హెల్ప్‌లైన్ నెంబర్ - 92816 07001 ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సు ఛార్జీలు లేదా ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించి తక్షణ పరిష్కారం అందిస్తారని పేర్కొన్నారు. ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌ను ప్రతి ప్రైవేట్ బస్సులో స్పష్టంగా ప్రదర్శించాలని బస్సు యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మోటార్ వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రోజు నిర్వహించిన తనిఖీలలో అధిక ఛార్జీలు వసూలు చేసిన 2 ప్రైవేట్ బస్సులను సీజ్ చేసి, మరో 5 బస్సులపై కేసులు నమోదు చేసి మొత్తం 60,000/- జరిమానా విధించామని తెలిపారు. అదేవిధంగా పన్ను, పర్మిట్ తదితర నిబంధనలు ఉల్లంఘించిన 32 బస్సులపై గత వారం రోజులుగా కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక తనిఖీలు మరియు పర్యవేక్షణ చర్యలు జనవరి 19, 2026 వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎల్‌ఎల్‌ఆర్‌లు మరియు ఇతర పనుల కోసం =ూా కార్యాలయానికి వచ్చిన ప్రజలకు రహదారి భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనలపై రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పించినట్లు తెలిపారు. రవాణా కమీషనర్ వారి ఆదేశాల మేరకు, ప్రైవేట్ బస్సులు అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు భద్రతతో కూడిన ప్రయాణం అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పండుగ కాలంలో ప్రయాణికుల శ్రేయస్సు కోసం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఉప రవాణా కమీషనర్ తెలిపారు.

# 3వ డివిజన్ బౌండరీ సమస్యను పరిష్కరించండి

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు వినతి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భీమిలి జోన్ 3వ డివిజన్ భౌగోళిక బౌండరీ సమస్య కారణంగా సరిహద్దుల్లో ఉండే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా భీమిలి జోనల్ కమీషనర్ టి.నాగేంద్రకుమార్‌కి 3వ వార్డులో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గంటా నూకరాజు స్థానిక టిడిపి నాయకులతో కలసి వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ భీమిలి మున్సిపాలిటీ జీవీఎంసీలో విలీనం అయిన తర్వాత వార్డులలో ఉండే బౌండరీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గతంలో ఎన్నిసార్లు వినతిపత్రం ద్వారా. తెలియజేసినా అధికారులలో స్పందన లేదని అన్నారు. దీని కారణంగా నేరళ్లవలస కోలనీ పాలిటెక్నిక్, రాజీవ్ గృహకల్ప ఏరియాలో జీవించే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అక్కడ ప్రజల యొక్క ఓట్లు 3వ వార్డులో ఉన్నప్పటికీ సచివాలయం నాల్గవ వార్డులో ఉండటమే పెద్ద సమస్యగా మారిందని అన్నారు. దీనికారణంగా పాస్ పోర్టు చేయించుకోవాలన్నా లేదా మరి ఏ ఇతర సమస్య అయినా అక్కడ ప్రజలకు పెను సవాలుగా మారిందని దీనిని త్వరతగతిన పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా 3వ వార్డు పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని పర్యాటకులను ఆహ్లాదపరిచేవిధంగా భీముడు - బకాసురుడు, చత్రపతి శివాజీ, స్వామి వివేకానంద, పంచపాండవులు, మత్స్యకారులు-పడవుల విగ్రహాలను బీచ్ పార్కులలో, తీరం వెంబడి ఏర్పాటు చేయాలని అన్నారు. తీరం కోతకు గురవుతుందని సముద్ర తీరం వెంబడి రక్షణగోడ (రిటైనింగ్ వాల్) నిర్మించాలని కోరారు. ఈ ప్రతిపాదన ఎప్పటినుండో ఉందని త్వరితగతిన చర్యలు చేపట్టాలని అన్నారు. జమ్ముచెరువులో పిపిపి పద్ధతులలో బోటు షికారు ఏర్పాటు చేసి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలను కమీషనర్‌కి ఇచ్చిన వినతిపత్రం ద్వారా గంటా నూకరాజు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్ కుమార్, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, పుక్కళ్ళ లక్ష్మీకుమారి, పైడిపల్లి నర్సింగరావు, వియ్యపు నాయుడు, కంటుబుక్త శ్రీనివాసరావు మాస్టర్, కుప్పిల గురుమూర్తి, అప్పికొండ నర్సింగరావు, యానాపు శ్రీను, సంకురుభుక్త లక్ష్మణరావు, కందుల సుందర్ రావు, సంజీవరావు, మట్టా దాసు, నొల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘోరం.. భార్య గొంతు కోసిన భర్త.. అడ్డొచ్చిన కూతురిపైనా..



**సిద్దిపేట, (రాజధాని వార్తలు):** సిద్దిపేట పట్టణంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కట్టుకున్న భార్యను అతికిరాతంగా హత్య చేశాడు భర్త. అడ్డుకోబోయిన కూతురి పట్ల కూడా దారుణంగా ప్రవర్తించాడు. ఈ దాడి అనంతరం.. అతడూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేటలోని ఆదర్శ్ నగర్‌లో ఎల్లయ్య, శ్రీలత అనే దంపతులు నివసిస్తున్నారు. వీరికి అర్చన(16) అనే కూతురు ఉంది. అయితే.. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఇద్దరి మధ్య గొడవ తారాస్థాయికి చేరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన భర్త.. కత్తితో భార్య గొంతు కోసేశాడు. ఆమెపై విచాక్షణారహితంగా దాడి చేసేందుకు యత్నించిన తండ్రిని కూతురు అడ్డుకోబోయింది. దీంతో మరింత రెచ్చిపోయిన అతడు.. కూతురినీ రోకలి బండతో కొట్టాడు. భార్యాబిడ్డలపై దాడి అనంతరం.. భయంతో ఎల్లయ్య తన గొంతు కోసుకున్నాడు. ఎల్లయ్య ఇంట్లో నుంచి కేకలు విన్న స్థానికులు అక్కడకు వచ్చి చూడగా రక్తపుమడుగులో ముగ్గురూ పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ముగ్గురినీ ఆస్పత్రికి తరలించారు. అయితే.. అప్పటికే భార్య శ్రీలత(32) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం.. ఎల్లయ్య, అర్చనలు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# స్కూళ్ల గేట్లకు తాళాలు.. విద్యార్థుల అగచాట్లు



**భువనగిరి/నాగర్ కర్నూల్, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ అధికారుల అలసత్వం.. రాజకీయ పార్టీల నిర్లక్ష్యం.. స్థానిక నేతల కమీషన్ల కక్కుర్తి.. ఇలా వీటిలో ఏదో ఒకటి బలంగా పని చేస్తోంది. వాటి కారణంగా విద్యార్థులు, వారికి విద్య నేర్పిన ఉపాధ్యాయులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. తాజాగా.. తెలంగాణలోని రెండు జిల్లాల్లో దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సర్పంచ్ కీసరి రాంరెడ్డి అదనపు భవన నిర్మాణం చేపట్టారు. ఆ నిధులకు సంబంధించిన నగదు నేటికీ ఆయన చేతికి అందలేదు. నిధుల కోసం ఆయన పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరిగారు. కానీ వారి నుంచి కనీస స్పందన లేకుండా పోయింది. దీంతో ఆగ్రహించిన రాంరెడ్డి.. సోమవారం ఆ పాఠశాల గేటుకు తాళం వేశారు. సంక్రాంతి సెలవులు ముగించుకుని పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఆ గేటుకు తాళం ప్రత్యక్షమైంది. దీంతో పాఠశాల గేటు ముందు వారంతా గంటల తరబడి నిలబడి ఉన్నారు. అలాగే ఉపాధ్యాయులు సైతం వారితో కలిసి అక్కడే నిల్చోవాల్సి వచ్చింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని.. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. నాగర్ కర్నూల్ జిల్లా కోడెర్ ప్రభుత్వ పాఠశాలకు కాంట్రాక్టర్లు తాళం వేశారు. మన ఊరు - మన బడి నిర్మాణ భవనానికి సంబంధించిన బిల్లులు రాలేదంటూ పాఠశాల గేటుకు వారు తాళం వేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గంటల పాటు గేటు బయటే నిరీక్షించారు. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ భాస్కర్ శర్మ జోక్యం చేసుకుని.. పాఠశాల కాంట్రాక్టర్లతో మాట్లాడారు. ఆ తర్వాత పాఠశాల గేటుకు వేసిన తాళాన్ని తొలగించారు. అనంతరం.. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ పాఠశాలల్లోని తరగతి గదులకు వెళ్లారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన నగదు వెంటనే చెల్లించాలని.. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రులు సూచిస్తున్నారు.

# సంపాదకీయం

## బొగ్గు కోస... నీచ కథన!

అసలేం జరిగింది? ఎన్టీవీ జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేయడానికి కారణమేమిటి? గతంలో ఎన్నడూ లేనంతగా అఖిల భారత సర్వీసు అధికారులు సదరు చానల్‌పై చర్యలు తీసుకోవాలనేంత పట్టుదల ఎందుకు ప్రదర్శిస్తున్నారు? మంత్రి కోమటిరెడ్డిని, మహిళా ఐఏఎస్ అధికారులను ఈ వివాదం లోకి ఎన్టీవీ లాగడం వెనుక ఏం జరిగింది? ఈ వ్యవహారంలో మీడియా హద్దులు దాటిందా? ఈ మొత్తం వ్యవహారానికి సింగరేణి సంస్థకు చెందిన నైనీ బొగ్గు బావి నుంచి బొగ్గు తవ్వకానికి సంబంధించిన టెండర్ కారణమా? భారత రాష్ట్ర సమితి నాయకులు విమర్శిస్తున్నట్టుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీడియాను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నదా? లేక మీడియానే ప్రభుత్వాన్ని లొంగదీసుకొనే ప్రయత్నం చేసిందా? ఈ వ్యవహారంపై బయట జరుగుతున్న ప్రచారమేమిటి? తెర వెనుక జరిగిందేమిటి? వ్యాపార ప్రయోజనాలకోసం మహిళా అధికారుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సమర్థనీయమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాలంటే అసలేం జరిగిందో తెలుసుకోవాలి! ఎక్కడో ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ కోసం టెండర్లు పిలవడమేమిటి? ఆ టెండర్ల ఖరారులో జాప్యం జరగడమేమిటి? ప్రతిగా ఎన్టీవీలో ఒక అనైతిక కథనం ప్రసారం అవడమేమిటి? ఇందులో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాత్ర ఏమిటి? ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రంగంలోకి ఎలా వచ్చారు? ఈ వ్యవహారం గురించి తెలిసి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉండి పోవలసి వచ్చింది? అని ప్రశ్నించుకుంటే మళ్లీ నైనీ బొగ్గు బ్లాక్ వ్యవహారమే మూల కారణమని స్పష్టమవుతుంది. నైనీ బ్లాక్ నుంచి బొగ్గు తవ్వి తీసే కాంట్రాక్టు భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు కూడా వివాదాస్పదమైంది. అప్పట్లో అదానీని ముందుపెట్టి ప్రతిమా శ్రీనివాస్‌కు చెందిన సంస్థకు ఈ కాంట్రాక్టు కట్టబెట్టాలని కేసీఆర్ ప్రభుత్వం యోచించింది. దీంతో అప్పట్లో ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి పోరాటం చేశారు. తన సోదరుడికి చెందిన సుశీ హైటెక్ కంపెనీకి సదరు టెండర్‌లో పాల్గొనే అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన ఎంపీగా రాష్ట్ర స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఫిర్యాదులు చేశారు. దీంతో అప్పట్లో ఆ టెండరు ఖరారు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం జరిగింది. ప్రతిమా శ్రీనివాస్‌ను దృష్టిలో పెట్టుకొని తయారు చేసిన టెండర్‌ను రద్దు చేయడం జరిగింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మళ్లీ నైనీ బ్లాక్ వ్యవహారం తెర మీదకు వచ్చింది. ఇప్పుడు ఈ టెండర్‌పై ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, ఎన్టీవీ అధిపతి నరేంద్ర చౌదరి ఆసక్తి చూపుతున్నారని... తాము తెరమీదకు తెచ్చిన సంస్థకు టెండర్ దక్కేలా టెండర్ నిబంధనలు రూపొందించారని అధికారులు చెబుతున్నారు. టెండర్‌లో పాల్గొనే సంస్థలు సదరు బొగ్గు బ్లాక్‌ను సందర్శించాలన్న వింత నిబంధనను విధించారు. బొగ్గు బ్లాక్‌ను ఎవరైనా సందర్శించవచ్చు కదా? అదేమి నిబంధన? క్షేత్ర స్థాయి పరిస్థితులు, ఓవర్ బర్డెన్ ఎంత అనేది నిర్ణయించుకోకుండా ఏ కంపెనీ అయినా రేట్ ఎలా కోట్ చేస్తుంది? అయినా, ఫీల్డ్ విజిట్ చేసి ఉండాలన్న నిబంధన విధించడం హాస్యాస్పదం కాదా? అస్మదీయులకు మాత్రమే టెండర్‌లో పాల్గొనే అవకాశం కల్పించడానికే ఇటువంటి సిల్లీ నిబంధన విధించారని చిన్న పిల్లల్ని అడిగినా చెబుతారు. దీంతో మేఘా ఇంజనీరింగ్ కంపెనీని రంగంలోకి దించారు. మైనింగ్‌లో అనుభవం లేని మేఘా ఇంజనీరింగ్ కోసమే ఫీల్డ్ విజిట్ అనే నిబంధనను పెట్టారని అధికారులు చెబుతున్నారు. ఎన్టీవీ యజమాని చౌదరి అల్లుడికి చెందిన వెన్సర్ కంపెనీకి కూడా అర్హత లేనందున మేఘా, వెన్సర్‌లను కలిపి జాయింట్ వెంచర్‌గా ఏర్పాటు చేశారు. ఈ దశలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రంగప్రవేశం చేశారు. తన సోదరుడికి చెందిన సుశీ హైటెక్ కంపెనీకి ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ జారీ చేయవలసిందేనని ఆయన పట్టుబట్టారు. సుశీ హైటెక్ కంపెనీకి సర్టిఫికెట్ జారీ అయితే పోటీ ఏర్పడుతుంది. తమ స్కెచ్ అమలు కాదని భావించి ఒక అనైతిక కథనం వండి వార్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడి కంపెనీని పోటీ నుంచి తప్పించడానికి చేసిన ఈ ప్రయత్నాలు ఫలించలేదు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇదే బొగ్గు బ్లాక్ కోసం ప్రధాన మంత్రిని సైతం కలిసి టెండర్లు రద్దు చేయించిన అనుభవం ఉన్న వెంకటరెడ్డి ఇప్పుడు కూడా సదరు బొగ్గు బ్లాక్ కోసం పట్టుబడుతున్నారు. దీంతో వివాదం రేవంత్‌రెడ్డి వద్దకు చేరింది. ఇదంతా కొంప ముంచే వ్యవహారంలా ఉందని భావించిన ముఖ్యమంత్రి సదరు టెండరును ఖరారు చేయకుండా వాయిదా వేయించారు. ఆ వెంటనే నల్లగొండ జిల్లాకు చెందిన ఒక మంత్రి రాసలీలలు అని ఎన్టీవీలో కథనం ప్రసారమైంది. దీంతో మంటలు అంటుకున్నాయి. రాజకీయం–వ్యాపారం జర్నలిజం అన్నీ కలగాపులగం అయ్యాయి. వ్యవహారం ఇంత దూరం రావడానికి కూడా ఈ నిబంధనే కారణం. క్షేత్ర స్థాయి సందర్శన ఏ కంపెనీ అయినా చేయవచ్చు కదా? ఇంత సింపుల్ నిబంధన పెట్టారేమిటి? అనే సందేహం ఎవరికైనా కలుగుతుంది. అయితే ఇందులోనే తిరకాసు అంతా ఉంది. కావలసిన కంపెనీ వారికి మాత్రమే ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్‌ను అధికారులు జారీ చేస్తారు. తస్మదీయ కంపెనీలకు సర్టిఫికెట్ జారీ చేయరు. ఈ లొసుగును అడ్డుపెట్టుకొని కావాల్సిన కంపెనీకి నైనీ కోల్ బ్లాక్‌ను కేటాయించడానికి స్కెచ్ సిద్ధమైంది. అనుకున్నవన్నీ అనుకున్నట్టు జరగవు కదా! ఈ దశలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడైన అనిల్‌రెడ్డికి చెందిన సుశీ హైటెక్ కంపెనీ రంగంలోకి దిగింది. మైనింగ్ తవ్వకాల్లో ఈ కంపెనీకి అనుభవం ఉంది. పలు రాష్ట్రాలలో బొగ్గు తవ్వకాలు జరుపుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఒక్క కంపెనీకే టెండర్‌లో పాల్గొనే అర్హతలు ఉన్నాయి.

# సాంప్రదాయక క్రీడలు స్ఫూర్తిని, నైపుణ్యాలను పెంపొందిస్తాయి : డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** క్రీడలు యువతలో క్రీడా స్ఫూర్తిని, నైపుణ్యాలను పెంపొందిస్తాయని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చలువ తోట ప్రాంతంలో నిర్వహించిన పలు క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు డాక్టర్ కందుల నాగరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఐకమత్యాన్ని, క్రమశిక్షణను పెంచుతాయని చెప్పారు. అలాగే ఉత్సాహభరితమైన వాతావరణాన్ని సృష్టించడం జరుగుతుందని వెల్లడించారు. సాంప్రదాయమైన క్రీడా పోటీలు మానసిక వికాసానికి, శారీరక ధృడ త్వానికి సహాయపడడమే కాకుండా, పోటీతత్వాన్ని, స్నేహ పూరిత వాతావరణాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలలో పాల్గొన్న



ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ పోటీలలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి కూడా అభినందనలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎర్రాజి, కుమార్, రమేష్ పాడి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నేతన్నలపై కేంద్రానిది రాజకీయ కక్షే: కేటీఆర్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (ఖఖీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా జాప్యం చేస్తోందని, వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ విషయంపై కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కి కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. సిరిసిల్లలో 'మెగా పవర్ లూమ్ క్లస్టర్' ఏర్పాటు చేయాలనే డిమాండ్ నిన్న, మొన్నటిది కాదని, గత పదేళ్లుగా దీనిపై తాము నిరంతరాయంగా పోరాడుతున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. గతంలో మంత్రిగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, సిరిసిల్లా శాసన సభ్యుడిగా కేంద్రానికి అనేక విజ్ఞప్తులు చేశానని తెలిపారు. అయితే ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల నిర్ణయానికి రాకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. సిరిసిల్ల క్లస్టర్ ఏర్పాటు కోసం గత పదేళ్లలో సుమారు పదిసార్లు కేంద్ర మంత్రులను స్వయంగా కలిసి మెగా పవర్ లూం క్లస్టర్ కోసం నివేదికలు, వినతులు ఇచ్చామని గుర్తు చేశారు. అరుణ్ జైట్లీ, స్మృతి ఇరానీ మొదలుకొని నేటి మంత్రి వరకు ప్రతి ఒక్కరినీ బతిమిలాడామని ప్రస్తావించారు. నిబంధనల ప్రకారం సిరిసిల్లకు అన్ని అర్హతలు ఉన్నాయని కేంద్ర బృందాలే ధ్రువీకరించినా, ఫైళ్లను పక్కన పెట్టడం వెనుక ఉన్న మర్మమేమిటి? అని ప్రశ్నించారు. తెలంగాణ అంటే కేంద్రానికి ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, తెలంగాణ అభివృద్ధిని, ముఖ్యంగా ఇక్కడి నేతన్నలపై కేంద్రం చూపుతున్న వివక్షనేనని ధ్వజమెత్తారు. సిరిసిల్ల తెలంగాణ వస్త్ర పరిశ్రమకు గుండెకాయని కేటీఆర్ పేర్కొన్నారు. అక్కడ 30 వేలకు పైగా పవర్ లూమ్స్ కలిగి ఉండి, వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సిరిసిల్ల కంటే తక్కువ సామర్థ్యం, తక్కువ కార్మిక శక్తి ఉన్న ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతాలకు మెగా క్లస్టర్లను మంజూరు చేసిన కేంద్రం, అన్ని అర్హతలు ఉన్న సిరిసిల్లను పక్కన పెట్టడం ప్రాంతీయ వివక్షకు పరాకాష్టమని ఆరోపించారు. సిరిసిల్లకు మెగా క్లస్టర్ రాకపోవడానికి కారణం మెరిట్ లేకపోవడం కాదని, కేంద్రానికి తెలంగాణపై ఉన్న కక్షేనని కేటీఆర్ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మెగా క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, నిరంతర విద్యుత్, నీరు, సింగిల్ విండో అనుమతులు, రాష్ట్ర స్థాయి ప్రోత్సాహకాలు.. ఇలా ప్రతి ఒక్క అర్హతను పూర్తి చేసిందని వివరించారు. ఇవన్నీ సిద్ధంగా ఉన్నాయని పదేపదే చెబుతున్నా, ఎటువంటి సాంకేతిక లేదా ఆర్థిక కారణాలు చూపకుండా కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టడం సిగ్గుచేటని ఫైర్ అయ్యారు. ఒకవైపు 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' అని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్రం, దేశంలోనే అత్యంత సామర్థ్యం కలిగిన సిరిసిల్ల వంటి వస్త్ర పరిశ్రమ కేంద్రానికి మద్దతు ఇవ్వకపోవడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ద్వంద నీతికి, చిత్తశుద్ధిలేని తనానికి అద్దంపడుతోందని ఆక్షేపించారు. బీజేపీ ప్రభుత్వం కేవలం నినాదాలకే పరిమితం అయిందని విమర్శించారు. కేంద్రం చేస్తున్న ఈ జాప్యంతో సిరిసిల్లా నేతన్నలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారని పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో 'భారత్ స్పందన'ది కీలక పాత్ర

### - స్వయంకృషితో ఎదిగిన ఎడిటర్ శ్రీనివాస్ అభినందనీయం
### - పత్రికా క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విలేకరి స్థాయి నుంచి పత్రికా అధినేతగా ఎడిటర్ కొట్యాడ శ్రీనివాస్ ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ప్రశంసించారు. గోపాలపట్నంలోని పార్టీ కార్యాలయం వేదికగా 'భారత్ స్పందన' తెలుగు వారపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పార్టీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను 'భారత్ స్పందన' పత్రిక ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తుండటం అభినందనీయం. కేవలం వార్తలే కాకుండా ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై నిర్మాణాత్మకమైన కథనాలను ప్రచురించి, సమస్యలను మా దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తాం అని సూచించారు. శ్రీనివాస్ నాకు చాలా కాలంగా సుపరిచితులు. గతంలో అనేక పత్రికల్లో పనిచేసిన అనుభవం ఆయనకుంది. ఒక సాధారణ విలేకరిగా ప్రస్థానం మొదలుపెట్టి, నేడు స్వయంగా



'భారత్ స్పందన' పేరుతో పత్రికను స్థాపించి నడిపించే స్థాయికి ఎదగడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. రానున్న రోజుల్లో ఈ పత్రిక ప్రజా ఆదరణ పొంది మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ కొట్యాడ శ్రీనివాస్‌తో పాటు కూటమి పక్షాలకు చెందిన స్థానిక కార్పొరేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సోనోవిజన్ లక్కీ డ్రా కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

### - కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, మాజీ మంత్రి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ద్వారకానగర్ సోనోవిజన్ షోరూంలో జరిగిన లక్కీ డ్రాలో గెలుపొందిన విజేత లకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఫోన్ ద్వారా విజేత లకు శుభాకాంక్షలు తెలియజేశారు. మొదటి బహుమతి కారు, రెండవ బహుమతి రిఫ్రిజిరేటర్, మూడవ బహుమతి టీవీ, నాలుగో బహుమతి వాషింగ్ మిషన్‌లో గెలుపొందిన విజేతలకు స్వయంగా ఎమ్మెల్యేలు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోనోవిజన్ ద్వారా అనేకమంది యువకులకు ఉపాధి కల్పిస్తున్నారని మరిన్ని బ్రాంచ్లు ఏర్పాటు చేసి మరింత మందికి ఉపాధి అవకాశాలు కలుగజేయాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు అక్కిరెడ్డి జగదీష్, స్థానిక నేతలు శివ, సతీష్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ పోటీపై ఎంపీ అప్పలనాయుడు సమాధానమిదే...




**హైదరాబాద్/అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడిస్తామని విజయనగరం ఎంపీ అప్పలనాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వార్డ్ మెంబర్ నుంచి కార్పొరేషన్ వరకు కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు 16 నెలల్లో చేసి చూపించారని అన్నారు. ఇరు తెలుగు రాష్ట్రాలు చంద్రబాబుకు రెండు కళ్లు అని ఎంపీ అన్నారు. తెలంగాణలోనూ తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందని చెప్పారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పోటీచేసే అంశంపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని అప్పలనాయుడు వెల్లడించారు. బీఆర్ఎస్, వైసీపీ కుమ్మక్కై సీఎం చంద్రబాబు మీద ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నదీ జలాలపై బురద రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. జగన్ కోర్ట్‌కు హాజరైతే బీఆర్ఎస్ వాళ్లు ఫ్లెక్సీలు పెట్టి స్వాగతం చెబుతున్నారని.. కేటీఆర్ ఖమ్మం వెళ్తే వైసీపీ నేతలు ఫ్లెక్సీలు పెడతారంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ, బీఆర్ఎస్.. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదని ఎంపీ అన్నారు.

# వైద్యం కోసం వచ్చే రోగులను డబ్బులు అడిగితే కఠిన చర్యలు

### - కెజీహెచ్ ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కేజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే రోగులను ఎవరైనా డబ్బులు అడిగితే, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. కేజీహెచ్‌లో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అత్యవసర వైద్య విభాగము, బర్నింగ్ వార్డ్, శరీర పునర్నిర్మాణ శస్త్ర చికిత్స విభాగము తదితర విభాగాలను తనిఖీ చేసి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేజీహెచ్‌లో ట్రీట్ మెంట్ కు డబ్బులు అడిగినట్టు రోగి బంధువులు తనకు తెలిపారని, ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కేజీహెచ్ సూపరిండెండెంట్‌ను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే చర్యలు తప్పవని, రోగులు సిబ్బంది ఎవరికీ డబ్బులు ఇవ్వరాదని పేర్కొన్నారు. కేజీహెచ్‌లో ఉచితంగా వైద్యం లభిస్తుందని తెలియజేసే



బోర్డులు పెట్టాలని సిబ్బందిని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరిండెండెంట్ ఐ.వాణి, పరిపాలన అధికారి బి.వి.రమణ, ఆర్ఎంవో బంగారయ్య, ఇతర విభాగాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలీల కెరీర్‌లో తప్పెక్కడ జరుగుతోంది?



తెలుగు అమ్మాయి శ్రీలీల ట్యాలెంట్‌తో ఇప్పటికే స్టార్ హీరోయిన్ గా బిజీ అవ్వాలి. కానీ అమ్మడికి నటిగా మాత్రం ఇంకా దక్కాల్సిన గుర్తింపు ఇంకా దక్కలేదు. చెప్పుకోవడానికి 17 సినిమాల్లో నటించిన నటే అయినా? పేరు..గుర్తింపు మాత్రం అంతంగా మాత్రంగానే దక్కాయి అన్నది కాదనలేని నిజం. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన అమ్మడు'కిస్' చిత్రంతో కన్నడలో హీరోయిన్‌గా లాంచ్ అయింది. అటుపై 'పెళ్లి సందడి'తో తెలుగులోనూ ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతోనే శ్రీలీల ట్యాలెంట్ బయట పడింది. నటనతో పాటు మంచి డాన్సర్ కూడా కావడంతో వెలుగులోకి వచ్చింది. నటిగా మంచి భవిష్యత్ ఉంటుందని విశ్లేషకులు అంచనా వేసారు. పైగా తెలుగులో ఇంతటి ప్రతిభావంతురాలు ఈ మధ్య కాలంలో ఎవరూ రాలేదనే ఇమేజ్ కూడా శ్రీలీలపై పడింది. కానీ టాలీవుడ్‌లో శ్రీలీల సినిమాలు చేసిన విధానం చూస్తే వాటిలో గుర్తింపునిచ్చే పాత్రలు మూడు నాలుగు సినిమాలకే పరిమితమైనట్లు కనిపిస్తోంది. ప్రత్యేకించి బాలయ్య హీరోగా నటించిన 'భగవంత్ కేసరి'లో శ్రీలీల కీలక పాత్ర పోషించింది. ఈ సినిమాలో శ్రీలీల పాత్రకు మంచి గుర్తింపు దక్కింది. విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత మరో మూడు నాలుగు సినిమాల్లో నటించిన పాత్రలకు మంచి పేరొచ్చింది. టాలీవుడ్ పరంగా చూస్తే ఓ ఎనిమిది..తొమ్మిది సినిమాలు ఇప్పటికే చేసింది. మరి వీటి ద్వారా శ్రీలీల సాధించింది ఏంటి? అంటే పెద్దగా ఆశించిన ఫలితాలైతే కనిపించలేదు. అయితే ఈ విషయాన్ని శ్రీలీల చాలా ఆలస్యంగా గమనించింది. తన కెరీర్‌లో తప్పు ఎక్కడ జరుగుతుందో ఇప్పుడిప్పుడే గ్రహిస్తోంది. ఈ క్రమంలోనే తెలుగులో వచ్చిన అవకాశాలు కాదని హిందీ సహా ఇతర పరిశ్రమల్లో బిజీ అయ్యే ప్రయత్నాలు చేస్తోంది. తెలుగు సినిమాల్లో కంటున్యూ అయితే పూర్తి ఐటం పాటలకే పరిమితం అవ్వాల్సి వస్తుందని, గ్లామర్ బ్యూటీగానే పరిశ్రమ గుర్తు పెట్టుకునే ప్రమాదం ఉందని గ్రహించి ఇతర భాషల్లో తనని తాను ప్రూవ్ చేసుకునే ప్రయత్నం చేస్తోంది. దీంతో కెరీర్ పరంగా గ్యాప్ వచ్చినా పర్వాలేదు గానీ మంచి పాత్రలు మాత్రమే చేయాలని మైండ్‌లో బలంగా ఫిక్స్ అయింది. ఆ కారణంగా తెలుగులో వచ్చిన కొన్ని అవకాశాలు కూడా కాదనుకుంది. తాజాగా శ్రీలీల ఫాలోవర్స్ , అభిమానులు కూడా మంచి సినిమాలు మాత్రమే చేయండని విజ్ఞప్తి చేస్తున్నారు. శ్రీలీల నుంచి 'ఊ అంటావా మావ' లాంటి పాటలకంటే ఆమెలో గొప్ప పెర్ఫార్మర్‌ని మాత్రమే అభిమానులు కూడా చూడాలనుకుంటున్నారు అన్నది క్లియర్‌గా అర్థమవుతుంది.

# తొలి టాలీవుడ్ డైరెక్టర్‌గా అనిల్ సరికొత్త రికార్డ్!



టాలీవుడ్‌లో ఎంత మంది క్రేజీ డైరెక్టర్లు, టాప్ డైరెక్టర్లు ఉన్నా హిట్ మెషీన్ అనిల్ రావిపూడి స్టైలే వేరు. ఆయన ట్రాకే సెపరేటు. మిగతా డైరెక్టర్లలో అత్యధిక శాతం మంది పాన్ ఇండియా సినిమాల వెంట పరుగెడుతూ రూ.200 కోట్ల మార్కుని దాటేందుకు ఆపసోపాలు పడుతుంటే అనిల్ మాత్రం చాలా సింపుల్‌గా.. పాన్ ఇండియాని టచ్ చేయకుండానే అద్భుతాలు సాధిస్తున్నాడు. మేకర్స్‌ని, స్టార్స్‌ని, సగటు సినీ ప్రేక్షకుడినీ తనదైన మార్కు కామిక్ మ్యాజిక్‌తో సర్‌ప్రైజ్ చేస్తున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్లలో తన స్టైలే వేరని నిరూపించుకుంటున్నాడు. కెరీర్ ప్రారంభం నుంచి జంధ్యాల మార్కు కామెడీ అంశాలకే పెద్ద పీటవేస్తూ..దానికి భార్యాభర్తలకు సంబంధించిన సున్నితమైన ఫ్యామిలీ రిలేషన్‌ని జోడిస్తూ దాని చుట్టూనే కథలని రన్ చేస్తూ బ్లాక్ బస్టర్లని తన ఖాతాలో వేసుకుంటున్నాడు. మిగతా డైరెక్టర్లంతా యాక్షన్, మాస్ మసాలా అంశాల చుట్టూ పరుగెడుతుంటే అనిల్ మాత్రం చాలా కూల్‌గా ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కామెడీ, యాక్షన్ అంశాలని జోడించేస్తూ వరుస విజయాల్ని సొంతం చేసుకుంటూ అంతా అవాక్కయ్యేలా చేస్తున్నాడు. తను సాధిస్తున్న సక్సెస్‌లని చూసి మిగతా డైరెక్టర్లు ఇది ఎలా సాధ్యం అవుతోందని బుర్ర బద్దలు కొట్టుకుంటున్నారంటే అనిల్ రావిపూడి తన సినిమా కథలని ఏ స్థాయిలో డీల్ చేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. తన మార్కు ఓ ఫార్ములాని క్రియేట్ చేసుకుని కెరీర్ ప్రారంభం నుంచి అనిల్ వరుసగా తొమ్మిది సూపర్ హిట్‌లని సొంతం చేసుకున్నాడు. ఇది దర్శకుడిగా అనిల్ సాధించిన రేర్ రికార్డ్. టాలీవుడ్‌లో ఈ ఫీట్‌ని సాధించిన రెండవ డైరెక్టర్‌గా అనిల్ ఇప్పటికే సరికొత్త రికార్డ్‌ని సొంతం చేసుకున్నాడు. తాజాగా అనిల్ రావిపూడి ఖాతాలో మరో రికార్డ్ వచ్చి చేరింది. ఏడాదికో సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తూ బ్లాక్ బస్టర్ హిట్‌లని సొంతం చేసుకుంటున్న అనిల్ గత ఏడాది 2025 సంక్రాంతికి వెంకీ మామతో 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీని అందించిన విషయం తెలిసిందే. సైలెంట్‌గా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్‌ల దుమ్ముదులిపింది. ఏకంగా ప్రపంచ వ్యాప్తంగా రూ.300 కోట్లకు పైనే రాబట్టి ట్రేడ్ వర్గాలని షాక్‌కు గురి చేసింది. దర్శకుడిగా అనిల్ రావిపూడిని మరో మెట్టు ఎక్కించింది.

ఇక ఈ సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రారంభం నుంచే అందరిలోనూ అంచనాల్ని పెంచేసిన ఈ మూవీ సంక్రాంతి విజేతగా నిలిచి బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబడుతోంది. జనవరి 12న విడుదలైన ఈ సినిమా ఇప్పటి వరకు బాక్సాఫీస్ వద్ద వరల్డ్ వైడ్‌గా రూ.292 కోట్లకు మించి వసూళ్లని రాబట్టింది. ఇలా బ్యాక్ టు బ్యాక్ రూ.200 కోట్ల మార్కు వసూళ్లని రాబట్టిన సినిమాలని అందించిన దర్శకుడిగా అనిల్ రావిపూడి సరికొత్త రికార్డుని సొంతం చేసుకోవడం విశేషం. రానున్న రోజుల్లో ఈ మూవీ మరింతగా వసూళ్లని రాబడుతుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

# గౌతమ్ ఎంట్రీ.. ఆ ఇద్దరు నిర్మాతల మధ్య గట్టి పోటీ!



సూపర్ స్టార్ మహేష్ బాబు వారసుడు గౌతమ్ ఘట్టమనేని వెండితెర అరంగేట్రం ఎప్పుడు ఉంటుందా అని ఘట్టమనేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే బాలనటుడిగా '1 నేనొక్కడినే' సినిమాలో తన మార్క్ చూపించిన గౌతమ్, ఇప్పుడు హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. సూపర్ స్టార్ కృష్ణ గారి లెగసీని, మహేష్ బాబు స్టార్‌డమ్‌ని ముందుకు తీసుకెళ్లే మూడో తరం వారసుడిగా గౌతమ్ ఎంట్రీపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం గౌతమ్ సినిమాకు సంబంధించిన ట్రైనింగ్ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారు. కేవలం బ్యాక్ గ్రౌండ్ ఉంది కదా అని వచ్చేయకుండా, నటనలో మెలకువలు నేర్చుకోవడానికి అమెరికా వెళ్లారు. అక్కడ ప్రతిష్టాత్మకమైన న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో యాక్టింగ్ కోర్స్ చేస్తున్నారు. ఇది పూర్తయి ఇండియాకు తిరిగి రాగానే, హీరోగా పరిచయం కావడానికి రంగం సిద్ధమవుతోంది. అయితే ఇప్పుడు అసలు చర్చ గౌతమ్‌ను ఇండస్ట్రీకి పరిచయం చేసే ఆ లక్కీ ప్రొడ్యూసర్ ఎవరు అనే దానిపైనే నడుస్తోంది. ఈ రేసులో ప్రధానంగా ఇద్దరు బడా నిర్మాతల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. వారిలో ఒకరు సీనియర్ నిర్మాత అశ్వినీ దత్ కాగా, మరొకరు మహేష్ బాబుకు అత్యంత సన్నిహితుడైన అనిల్ సుంకర. ఈ ఇద్దరూ గౌతమ్ మొదటి సినిమాను తమ బ్యానర్‌లో నిర్మించడానికి పోటీ పడుతున్నట్లు టాక్. గౌతమ్ ఇంకా ట్రైనింగ్‌లో ఉండగానే, ఇక్కడ టాలీవుడ్‌లో మాత్రం ఆయన డెబ్యూ కోసం నిర్మాతల మధ్య గట్టి పోటీ నెలకొంది. అశ్వినీ దత్ గారికి స్టార్ కిడ్స్‌ను ఇండస్ట్రీకి పరిచయం చేసిన సెంటిమెంట్ చాలా బలంగా ఉంది. గతంలో మహేష్ బాబును 'రాజకుమారుడు' సినిమాతో ఆయనే పరిచయం చేశారు. అలాగే రామ్ చరణ్ (చిరుత), అల్లు అర్జున్ (గంగోత్రి) వంటి స్టార్ హీరోల మొదటి సినిమాలు కూడా వైజయంతీ మూవీస్ బ్యానర్‌లోనే వచ్చాయి. ఆ సెంటిమెంట్ ప్రకారం గౌతమ్‌ను కూడా ఆయనే లాంచ్ చేస్తే బాగుంటుందనే అభిప్రాయం ఉంది. మరోవైపు అనిల్ సుంకర కూడా ఈ ప్రాజెక్ట్ పట్ల అంతే ఆసక్తిగా ఉన్నారు. మహేష్ బాబుతో అనిల్ సుంకరకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దూకుడు, సరిలేరు నీకెవ్వరు వంటి బ్లాక్ బస్టర్ సినిమాలను అందించిన ఆయన, గౌతమ్ ఎంట్రీ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించాలని ప్లాన్ చేస్తున్నారట. ఈ విషయంలో మహేష్ బాబు నిర్ణయం కీలకం కానుంది. ఫైనల్‌గా గౌతమ్ ఎప్పుడు వస్తాడు అనే క్లారిటీ ట్రైనింగ్ పూర్తయ్యాక వస్తుంది కానీ, ఎవరు తీసుకొస్తారు అనే దానిపై మాత్రం ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. అంతే కాకుండా దర్శకుడు ఎవరు అనేది కూడా మరో పెద్ద టాస్క్. మంచి కంటెంట్ ఉన్న దర్శకుడి చేతిలోనే పెట్టాలని చూస్తున్నారు. ఇక నిర్మాతలలో సెంటిమెంట్ పరంగా అశ్వినీ దత్ వైపు మొగ్గుతారా లేక సాన్నిహిత్యం కొద్దీ అనిల్ సుంకరకు ఛాన్స్ ఇస్తారా అనేది చూడాలి.

# నయనతారకు పోటీగా రష్మిక!





దక్షిణాది చిత్ర పరిశ్రమలో నెంబవర్ హీరోయిన్ ఎవరు? అంటే లేడీ సూపర్ స్టార్ నయనతార పేరే వినిపిస్తోంది. ప్రఖ్యాత తమిళ, తెలుగు పరిశ్రమల్లో నయన్ ఇమేజ్ ఎంతో ప్రత్యేకం. ఎంత మంది హీరోయిన్లు ఉన్నా మరెంత మంది కొత్త భామలు నిత్యం దిగుతమతి అవుతున్నా నయనతారను ఇంచు కూడా కదపలేకపోయారు. చిత్ర పరిశ్రమలో నయన్ తనని తాను అలా బిల్డ్ చేసుకుంది. తాను ప్రాధాన్యత ఇచ్చేది డబ్బుకు కాదు..అంతకు మించి అంటూ ఎన్నో సందర్భాల్లో ప్రూవ్ చేసుకుంది. ఇదే నయన్ క్రేజ్ కి ఓ స్పెషల్ రీజన్ గా చెప్పొచ్చు. మరో ఏడాది రెండేళ్ల పాటు నయనతారకు ఎలాంటి పోటీ ఉండదు. కానీ రెండేళ్ల తర్వాత సన్నివేశం మారే అవకాశం ఉంది. లేడీ సూపర్ స్టార్ కు పోటీగా నేషనల్ క్రష్ రష్మికా మందన్నా తయారవుతుందనే గెస్సింగ్స్ తెరపైకి వస్తు న్నాయి. 'పుష్ప' విజయంతో రష్మిక పాన్ ఇండియాలో ఎంతగా ఫేమస్ అయిందో తెలిసిందే. అదే క్రేజ్ తో బాలీవుడ్ లో నూ బిజీ నటిగా మారింది. నెటి జనరేష్ హీరోయిన్లలలో అత్యధిక పారితోషికం అందుకుంటోన్న నటిగా గుర్తింపు దక్కించుకుంది. ప్రత్యేకించి సౌత్ లో ఎనలేని క్రేజ్ ని సొంతం చేసుకుంది. సొంత పరిశ్రమ కన్నడలో వివాదాస్పదం అవ్వడానికి పరోక్షంగా ఈ క్రేజే కారణం అన్నది అంతే వాస్తవం. ఇదే క్రేజ్‌తో సౌత్‌లో ఎన్నో కొత్త అవకాశాలు క్యూ కడుతున్నాయి. కానీ రష్మిక మాత్రం సౌత్ సినిమాల్ని లైట్ తీసుకుంటుంది. తమిళ, తెలుగులో గొప్ప అవకాశాలైతే తప్ప కమిట్ అవ్వడం లేదు. నయనతార కూడా కొంత కాలంగా ఇదే విధానంలో సినిమాలు చేస్తోంది. బాలీవుడ్‌లో మాత్రం ఎలాంటి అంతరం లేకుండా పని చేస్తోంది. అలాగే రష్మిక లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటే ప్రయత్నాలు సీరియస్‌గానే చేస్తుంది. ఇప్పటికే 'ది గర్ల్ ఫ్రెండ్'తో మంచి విజయాన్ని అందుకుంది. ఆ సినిమాకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. త్వరలో 'మైసా' అనే హారర్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇలాంటి హిట్ రష్మిక ఖాతాలో పడితే సౌత్‌లో ఇమేజ్ రెట్టింపు అవుతుంది. నయనతార కూడా లేడీ ఓరియేంటెడ్ సినిమాలు చేస్తోంది. కానీ వాటితో మార్కెట్‌లో ఇంపాక్ట్ చూపించలేకపోతుంది. ఈ రెండు జానర్లలో నయనతార-రష్మిక లను పోలిస్తే రష్మిక బెస్ట్‌గా కనిపిస్తోంది. నేషనల్ క్రష్ ఇలాగే కొనసాగిస్తే నయనతార స్థానానికి ఎసరు పెట్టడం ఖాయమే.

# హరిత సైనికులు మన పచ్చని భవిష్యత్తు కోసం 50 వేల నారు మొక్కలు పంపిణీ

## - పుడమి పచ్చదనంతో కళకళలాడాలి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీనివాస రాజమణి, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎస్ ఆర్ యు, జివిఎంసి "హరిత సైనికులు" మన పచ్చని భవిష్యత్తు కోసం అనే ఆలోచన తో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ఏర్పాటు చేసిందని ఎస్ ఆర్ యు, జివిఎంసి ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస రాజమణి అన్నారు. ఈ మేరకు ముక్కనుమ సందర్భంగా విశాఖపట్నంలో రైల్వే స్టేషన్‌కు దగ్గరలో ఉన్న 150 సంవత్సరాల మర్రి చెట్టు వద్ద శనివారం ఉదయం గ్రీన్ సోల్జర్స్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసి 50 వేల నారు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుడమి పచ్చదనంతో కళకళలాడాలని అందుకు హరిత సైనికులు కృషి అవసరం అన్నారు. ప్రజలు అందరూ ఆరోగ్యంగా, హాయిగా, ఆదాయవంతంగా జీవించటానికి హరిత కృషి చేయాలి అనే ఆలోచన తో ఏర్పాటు చేసారన్నారు. ఇందులో చేరే యువత తమ స్వశక్తితో ఎదిగేలా శిక్షణ ఇవ్వడానికి, శిక్షణ పొందిన తర్వాత స్వంతంగా జీవించడానికి ఉపాధి కల్పన. వీరి ద్వారా నిరుపేదలను, దారీ తెన్నూ లేని వారికి గుర్తించి చేయూత ఇవ్వడం కూడా చేపడతారన్నారు. అలాగే సమస్త జీవరాశిని కాపాడటానికి, హాయిగా జీవించటానికి, ఎవరికి వారు తమ ఇంటి వద్ద ఆకుకూరలు, కూరగాయలు పండించుకునేందుకు హరిత సైనికులు కృషి చేసే విధంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ శిక్షణ ఇస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ గ్రీన్ సోల్జర్స్ కోసం పలువురు మిత్రులు, సంస్థలు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ శాఖలతో కలిసి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ కృషి చేస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించడానికి హరిత సైనికుల కృషి అవసరం అని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలు హాయిగా జీవించడానికి హరిత సైనికుల కృషి అవసరమని, అందుకే గ్రీన్ సోల్జర్స్ యువతకు రోల్ మోడల్స్‌గా తయారు చేయాలి అన్నది గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ఆలోచన అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శివలక్ష్మి, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రోజెక్ట్స్ సంస్థ అనకాపల్లి హెచ్ ఆర్‌డిఐ కృష్ణ కుమారి, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి, భూపేష్ నగర్, కొబ్బరి తోట ప్రాంతానికి చెందిన యువతులు, విద్యార్థులు, ఇంటి వద్ద ఆకుకూరలు కూరగాయలు పండించుకునే వారు పాల్గొన్నారు.

# ఎల్లసిరిలో అలరించిన గౌరీదేవి ఉత్సవం

## - విశిష్ట అతిథిగా హాజరైన కాపులూరు

**చిట్టమూరు, (రాజధాని వార్తలు):** సంక్రాంతి సందర్భంగా ఏటా ఏడాది పర్వదినాన నిర్వహించే గౌరీదేవి (గొబ్బెమ్మ) ఉత్స వాలను ఆదివారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఎల్లసిరి దిగువ గిరిజన కాలనీలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక తెదేపా నాయకులు,గూడూరు నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కాపులూరు చెంచరామయ్య ఆచారి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. మహిళలు ఆయనను సన్మానించారు. గౌరీ దేవికి మహిళలు ఉపవాసాలతో పండ్లు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. గౌరీ దేవి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో కొలువుదీర్చారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మావిడాకులతో తోరణాలు కట్టి, ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన లైటింగ్ కాంతుల వెలుగులలో మేళతాళాలు, కోలాటాలతో భక్తి పాటలతో విగ్రహాన్ని ఊరేగించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో తెదేపా స్థానిక నాయకులు గుండుబోయిన రామయ్య, వాటంబేటీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# జయ - విజయ్ మెమోరియల్ క్రికెట్ విజేత లింగసముద్రం జట్టు


## - విన్నర్ జట్టుకు ప్రైజ్ మనీ అందజేసిన జనసేన నేత డాక్టర్ మహీధర్ నాయుడు



**కందుకూరు, (రాజధాని వార్తలు):** కందుకూరు నియోజక వర్గం పరిధిలో గల మండల కేంద్రమైన లింగసముద్రం గ్రామంలో బలిజపాలెం బస్టాండ్ వద్ద సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని జయ శేఖర్ - విజయ్ శేఖర్‌ల జ్ఞాపకార్థం వారి మిత్ర బృందం ఈ 9వ తేదీ నుంచి మండల స్థాయిలో క్రికెట్ పోటీలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పోటీలలో విన్నర్‌గా నిలిచిన లింగ సముద్రం జట్టుకు విజయ్ శేఖర్ - జయశేఖర్‌లకు బాల్య స్నేహి తుడు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ అధికారి, జనసేన నేత డాక్టర్ మహీధర్ నాయుడు స్పాన్సర్ చేయగా, ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న లింగసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ ఉమ్మడిశెట్టి. మాధవరావు, లింగ సముద్రం మాజీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి. నాగేశ్వరరావు తదితరులు విజేతగా నిలిచిన లింగసముద్రం జట్టుకు రూ. 15,116లు అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన లింగ సముద్రం దక్షిణ వీధి సంఘం జట్టుకు అందించిన రూ. 10,116లు, తృతీయ బహుమతి పొందిన జంపాలవారిపాలెం జాగ్వర్స్ జట్టుకు రూ. 5,116లను జయ శేఖర్ - విజయ శేఖర్‌ల మిత్రబృందం స్పాన్సర్ చేయగా, అతిథులు సదరు జట్టు సభ్యులకు అందజేశారు. వారం రోజుల పాటు అత్యంత ఉల్లాసంగా, ఉత్సా హంగా జరిగిన ఈ పోటీలలో మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన క్రీడాకారునికి మహేంద్ర ట్రాక్టర్స్ తరుపున జయ శేఖర్ - విజయ్ శేఖర్‌ల బాల్య స్నేహితుడు తోట.నారాయణ అందజేశారు. పోటీల ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్.బి. ఐ మాజీ అధికారి, జనసేన నేత డాక్టర్ మహీధర్ నాయుడుతో పాటు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె.ప్రభాకర్, సాంబయ్య, కార్య నిర్వాహకులు ఈర్ల. సిద్దయ్య, టి.హజరత్, అంజయ్య, విజయ్ భాస్కర్‌లతో పాటు బలిజపాలెం యూత్ సభ్యులు, జయ శేఖర్ - విజయ్ శేఖర్‌ల మిత్రబృందం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవం అనంతరం అతిథులు, కార్యనిర్వాహకులు సంయుక్తంగా ఎస్.బి.ఐ మాజీ అధికారి, జనసేన నేత డాక్టర్ మహీ ధర్ నాయుడును శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు.

# తడ కేజీబీవీ విద్యార్థికి మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చేయుత

**తిరుపతి, (రాజధాని వార్తలు):** తడ కేజీబీవీ పాఠశాల విద్యార్థిని వెంకటలక్ష్మి మానవత స్వచ్ఛంద సేవ సంస్థ తిరుపతి శాఖ చైర్మన్ భార్గవ, విద్యా కార్యదర్శి విశ్రాంత ఆచార్యులు ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, కే ఆర్ లోకేష్‌లు తిరుపతి బర్డ్ హాస్పిటల్‌లో చికిత్స పొందు తున్న నేపథ్యంలో పది వేల రూపాయలు సహాయం అందజేశారు. ఇందులో 5000 రూపాయలు నగదు రూపంలోనూ, మరో ఐదు వేల రూపాయలు ఆ బాలికకు సంబంధించిన సామాగ్రిని అందజేసినట్లు వారు తెలిపారు. గాయపడిన విద్యార్థినికి ఆర్థికంగా చేయుత అందించిన మానవత స్వచ్ఛంద సేవ సంస్థ కార్యనిర్వాహకులను జిసిడిఓ పుష్ప అభినందించారు.



# శ్రీ వాసవి సేవ అన్న ప్రసాద కమిటీ పర్యవేక్షణలో దాతల సహాయంతో అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమం





**కారంపూడి, (రాజధాని వార్తలు):** పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలో గాంధీ బొమ్మ సెంటర్లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రతి శనివారం శ్రీ వాసవి సేవ అన్న ప్రసాద కమిటీ పర్యవేక్షణలో ఈ వారం దాతలుగా 150 మందికి ఒక దాత సహాయంతో, మరో 150 మందికి సహకరించిన వారు ఇల్లూరి పుల్లయ్య ధర్మపత్ని ఆదిలక్ష్మి, పల్లె బాలయ్య కుమారుడు యోగి సహకారం అందించారు. ఈ నారాయణ సేవ కార్యక్రమంలో అన్న ప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, కొల్లిపర. లీలా కిరణ్, మహిళా కమిటీ సభ్యులు మద్దు హైమావతి, బచ్చు నాగమణి, సూరే ధనలక్ష్మి, చిన్ని అనంతలక్ష్మి, భవనారి అనంతలక్ష్మి, చింతా రాజి, గుండా మహేశ్వరి, కొల్లిపర ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయవద్దు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు అధ్యక్షతన శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రూరల్ మం డలం, వేడాం గ్రామం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉపాధి హామీ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈరోజు సందర్భంగా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ఉద్దేశంతో జి రామ్ జి పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని, పథకం మార్పు వల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, రాబోవు రోజుల్లో ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే విధంగా ఈ కొత్త పథకం ఉందని తెలిపారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చినటువంటి మహనీయుడు మహాత్మాగాంధీ అని, అట్టివారిని అవమానించే విధంగా పథకంలో వారి పేరును తొలగించడం యావత్ భారతదేశాన్ని అవమానించడమని, గ్రామాల్లో పేదరిక నిర్మూలన, వలసలను ఆపడం కొరకు ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకువస్తే నేడు కేంద్ర ప్రభుత్వం ఆ పథకాన్ని ఎత్తివేసే దిశగా కొత్త చట్టాన్ని తీసుకు రావడం అందరికీ సందేహం కలగజేస్తోందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లోటు బడ్జెట్లో కలదని నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చినటువంటి జి రాంజీ పథకం వల్ల రాష్ట్రంపై 40 శాతం ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, నాగరాజు, మహేష్, అరుణ్, అల్లావుద్దీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎద్దల నరేంద్ర రెడ్డిని పరామర్శించిన పలువురు వైసీపీ నాయకులు

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నియోజకవర్గం సీనియర్ వైసీపీ నాయకులు యద్దల నరేంద్ర రెడ్డి తండ్రి వెంకట సుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పిఏసి సభ్యులు, కోవూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డిలు సోమవారం మంగళపూరు గ్రామంలోని నరేంద్ర రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయనను కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు, వైసీపీ సీనియర్ నాయకులు కలువ బాలశంకర్ రెడ్డి, గూడూరు మండల వైసీపీ కన్వీనర్మల్లు విజయ్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు గూడూరు రాజారెడ్డి, మూలి కిషోర్ రెడ్డిగారు, శ్రీధర్ రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.



# అర్చక పురోహితులకు పంచాంగములు అందచేత



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామ ధర్మిక సేవా సంస్థ ఆధ్వ ర్యంలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య స్వామివారి మఠంలో అర్చకులు, పురోహితులకు పంచాంగములను బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రాజ్ కుమార్, భాస్కర మూర్తి, సంస్థ ప్రతినిధి పారా హేమంత్ కుమార్ శర్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకట రామిరెడ్డి, హైమావతమ్మ, మధు కిరణ్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో పంచాంగములను పంపిణీ చేయడం చాలా సంతోషమన్నారు. హైందవ ధర్మంలో ప్రధానంగా ఉపయోగకరమైన పంచాంగములను అందించడం ముదావహమన్నారు. ముహూర్తములు, శుభ, అశుభ కార్యక్రములకు సమయాలను తెలియజేసే పంచాంగములు అందజేయడం దాతల దాతృత్వానికి నిదర్శనం అన్నారు. ఈ సంధర్భంగా దాతలకు, సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు, గొల్లనపల్లి ప్రభాకర శాస్త్రి, రత్న ప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటే విద్యార్థులకు కలర్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో కరాటే కలర్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. కెనీ షీటో ర్యూ కరాటే దో ఇండియాకి చెందిన ధనుష్ మాస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓపెన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. సుమారు 33 మంది విద్యార్థులకు కరాటే మాస్టర్ ధనుష్ కలర్ బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సరస్వతీ శిశు మందిర్ స్కూల్ కరస్పాండెంట్ ఎల్.మంగిరెడ్డి, కమిటీ మెంబర్స్ సురేష్, సతీష్, గౌతమ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నారావారి ఆశీస్సులతో దూకుడు ఎమ్మెల్యే బొజ్జలకు మంత్రి పదవి..?





**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందన్న ఊహాగానాలతో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి మంత్రి పదవి వచ్చే అవకాశాలు మెండుగా వున్నాయని తెలుస్తోంది. సంక్రాంతి పండుగకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్‌లను బొజ్జల కుటుంబసభ్యులు కలవడం, వారికి సిఎం కుటుంబ సభ్యుల ఆశీ స్సులు లభించడం చూస్తూ ఉంటే ముఖ్యమంత్రి మిత్రుడు, దివంగత మంత్రి బొజ్జల గోపాలకృష్ణా రెడ్డిపై వున్న అభిమానంతో కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవికి నోచుకోని తిరుపతి జిల్లా నుంచి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

అయితే ప్రస్తుతం వున్న మంత్రి వర్గం నుంచి 6 నుంచి 8 మంది మంత్రులకు ఉద్వాసన పలికి కొత్తవారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్ర మాలను విస్తృతంగా తనదైన శైలిలో ప్రజల్లోకి తీసుకెళ్లుతూ ప్రజా అవసరాల సాధనకు, నిధులు సాధనకు ఏకంగా అసంబ్లీ సమావేశంలో ప్రస్తావించడమే కాకుండా తండ్రి నుంచి నేర్చిన రాజకీయ పాఠంతో కాస్త ఉడుకు రక్తంతో ప్రజలకు సేవలు అందించడంలో అధికారులుపై దూకుడుగా వ్యవహరిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఎమ్మెల్యేలాంటి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో చోటు లభించే అవకాశాలు ఉండవచ్చు అనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి మంత్రి వర్గంలో చోటు లభించే అవకాశం వుంది. ఇదిలా ఉంటే ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ఆఖరి (మాజీ) ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు నల్లారి కిషోర్ కుమార్ పేరుతో పాటు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ లేదా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీల పేర్లు కూడా మంత్రి వర్గం విస్తరణలో ఒకరికి చోటు దక్కే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే వారందరూ గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ మినహా మిగిలిన ఎమ్మెల్యేలు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టిన వారే కావడం గమనార్హం. మరి కొత్త మంత్రి వర్గంలో అడుగు పెట్టేది ఎవరినేది తెలియాలంటే మంత్రివర్గ విస్తరణ వరకు వేచి చూడాల్సిందే.

# నేర్నూరు, చిత్తలూరులో క్లస్టర్ డెమోస్

**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండల పరిధిలోని నెర్నూరు, చిత్తలూరు గ్రామాలలో ఎన్ ఎస్ ఎమ్ క్లస్టర్ డెమో కార్యక్రమాలను జొన్న, శెనగ పంటలపై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ (ఆర్) శివనాయక్, మండల వ్యవసాయ అధికారి హిమబిందు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియో గాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులను అనుసరించాలని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. చవుడు నిర్మూలనకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ ఎల్.సుజాత, విఎఎలు నాగభూషణం, ఝాన్సీతో పాటు పెద్ద



సంఖ్యలో రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కళాకారులకు ఇచ్చిన ఇంటి స్థలాలు చూపించాలి : సిపిఎం పార్టీ



**దొరవారిసత్రం, (రాజధాని వార్తలు):** సోమవారం దొర వారిసత్రం మండల తహసీల్దార్ వారి కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కళాకారులు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పై కార్యక్రమంలో సి.పి.ఎం పార్టీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్, వందవాసి నాగరాజు మాట్లాడుతూ గతంలో అక్షర దీపం కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులను గుర్తించి ఆనాటి జిల్లా కలెక్టర్ దొరవారిసత్రం మండలంలో ఉన్న కళాకారులకు దొర వారిసత్రం మండల కేంద్రంలో సర్వే నంబర్ 44 మేత పోరంబోకు స్థలంలో, ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరిగిందని కొంతమంది కళాకారులు ఆ స్థలంలో పూరి గుడిసెలు వేసుకొని ఉన్నారని అయితే అప్పుడున్న పరిస్థితుల్లో ఆ స్థలం నివాస యోగ్యంగా లేకపోవడంతో కళాకారులు అక్కడ ఉండలేకపోయారని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా కళాకారులు తమకు కేటాయించిన స్థలాలను చూపాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని, కళాకారులకు కేటాయించిన అదే సర్వే నెంబర్లో భూస్వాములు ఆక్రమించుకొని కట్టడాలు సాగి స్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. లేనోడికి ఒక న్యాయం భూస్వాములు ఒక న్యాయమా అని విమర్శించారు. కళాకారులకు వెంటనే స్థలాలు చూపాలని లేనిపక్షంలో సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించవలసి వస్తుందని హెచ్చరించారు. అనంతరం తాహసిల్దార్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. తాహసిల్దార్ మాట్లాడుతూ కళాకారులకు దొరవారి సత్రం మండల కేంద్రంలో కచ్చితంగా ఇంటి స్థలాలు చూపిస్తానని హామీ ఇచ్చారు. పై కార్యక్రమంలో నాయకులు కె.వి మునేయ్య, ఎస్.కె రియాజ్, గూడూరు నాగరాజా, వెంకటేశ్వర్లు, వెంకటేష్, శ్రీనివాసులు, శంకర్, రమణయ్య, సుశీల, రఘురాం, జడయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వన్ విలేజ్.. 4 విజిట్స్‌లో ప్రజల సమస్యలను పరిష్కరించాలి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వన్ విలేజ్.. 4 విజిట్స్ కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను వేగంగా పరిష్కరిం చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్. ఆర్. శంకరన్ హాలులో వన్ విలేజ్.. 4 విజిట్స్, రెవెన్యూ పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, పిజిఆర్ఎస్ అర్జీలు, యూరియా నిల్వలు, చాంపియన్ ఫార్మర్ కార్యక్రమం, గృహ నిర్మాణాల ప్రగతి తదితర అంశాలపై ఆర్డీవోలు, కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్ విలేజ్.. 4 విజిట్స్ కార్యక్రమంలో ప్రజలు, రైతులు తెలియజేసిన రెవెన్యూ సంబంధిత సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ నెలలో ఈ కార్యక్రమం నిర్వహించిన గ్రామాల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా సమస్యల పరిష్కారం జరగాలని స్పష్టం చేశారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. చాంపియన్ ఫార్మర్లను ప్రోత్సహిస్తూ, వారి ద్వారా మిగిలిన రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యంగా, బాధ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి ఎండార్సుమెంట్లు ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి సమస్య మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. పరిష్కారం సాధ్యం కాకపోతే స్పష్టమైన కారణాలతో కూడిన ఎండా ర్సుమెంట్‌ను అర్జీదారునికి అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన నాణ్యత లోపం ఉన్న గృహ నిర్మాణాలను సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని మరమ్మతులు పూర్తి చేయించాలని హౌసింగ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్‌ఓ విజయ్ కుమార్, జడ్పీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తెలుగు ప్రజల ఆరాధ్యుడు యోగివేమన అని శ్రీకాళహస్తి రెడ్డిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చెంచురెడ్డి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో సోమవారం యోగి వేమన జయంతి వేడుకలను శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగివేమన పేరు తెలియని తెలుగువారు ఉండరని అన్నారు. చరిత్ర ప్రకారం ఆయన వినుకొండలో రెడ్డి రాజుల వంశంలో జన్మించారని చెప్పారు. కదిరి మండలం కటారి పల్లెలో జీవ సమాధి అయినట్లు చరిత్ర చెబుతుందని అన్నారు. జీవితంపై వైరాగ్యం చెంది వేమారెడ్డి వేమనగా మారి పద్య కవిత్వం చెప్పారని తెలిపారు. సామాజికవేత్త తత్వవేత్త యోగివేమన సమాజంలో తన పద్యాల ద్వారా సామాజిక పరిస్థితులపై యుద్ధం ప్రకటించి ప్రజల్లో ప్రజా చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. యోగి వేమనకు ప్రజా కవిగా బిరుదు సమాజం ఇచ్చిందని చెప్పారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం యోగి వేమన జయంతి జనవరి 19న రాష్ట్ర పండుగ గుర్తించి ఆయన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో



శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సునీల్ కుమార్ రెడ్డి, మునిరెడ్డి, రవికుమార్ రెడ్డి, రఘునాథరెడ్డి, భాస్కర్ రెడ్డి, కన్నలి ప్రభాకర్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, గోపాల్ రెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, ఆర్.కే ప్రసాద్ రెడ్డి, గురవారెడ్డి, మహేంద్ర నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# చేజర్ల మండలంలో దోమల విద్యం వలన ఆందోళనలో ప్రజలు



**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండల వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా గ్రామాలలో దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ పరిస్థితి దారుణంగా ఉండటంతో ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితులకు తోడు పారిశుధ్య లోపం తోడవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామాల్లోని మురుగు కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం వల్ల నీరు నిల్వ ఉండి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రధాన కూడళ్లలో చెత్త కుప్పలు పేరుకుపోవడం, ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీరు నిలిచి ఉండటంతో దోమలు వేగంగా వృద్ధి చెందుతున్నాయి. స్థానిక పంచాయతీలు పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేశాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దోమల పెరుగుదలతో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యావంటి విషజ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో పిల్లలు, వృద్ధులు అడపాదడపా జ్వరాల బారిన పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక, ప్రభుత్వ వైద్యం అందక సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తక్షణమే ఫాగింగ్ (దోమల నివారణ పొగ) చేయించాలని, కాలువల్లో పూడిక తీసి, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి క్రిమిసంహారక చర్యలు చేపట్టి, ప్రజారోగ్యంపై గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అవగాహన కల్పించాలి. "రాత్రి పూట దోమల కారణంగా నిద్రపోవాలంటే నరకంగా ఉంది. చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మా ప్రాణాలు కాపాడాలి" అని మండల ప్రజలు వేడుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

## - తెలుగుదేశం జెండాను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన యోగ పురుషుడు ఎన్టీఆర్ : కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్

**ఆనందపురం, (రాజధాని వార్తలు):** విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా ఆనందపురం ఎల్.వి పాలెంలో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ తాట్రాజు అప్పారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, తెలుగు జాతికి ఆత్మగౌరవాన్ని అందించిన మహానేత నందమూరి తారక రామారావు అని కొనియాడారు. సినీరంగంలో నటసార్వభౌముడిగా విశ్వవ్యాప్త గుర్తింపు సాధించడమే కాకుండా, రాజకీయ రంగంలోకి ప్రవేశించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగు ఖ్యాతిని దశదిశల వ్యాప్తి చేస్తూ, తెలుగుదేశం పార్టీ జెండాను రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి తీసుకెళ్లిన యోగ పురుషుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, ప్రజాస్వామ్య విలువలు, ఆత్మగౌరవ రాజకీయాలకు ఎన్టీఆర్ జీవితం అద్దం పడుతుందని తెలిపారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను నేటి తరం నాయకులు, కార్యకర్తలు ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన నివాళి అవుతుందని కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ బి నాయుడు, కాకర సురేష్, వైకుంఠం శేఖర్, మురుపిల్ల సాయి జ్ఞానేశ్వర్‌తో పాటు తెలుగు మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాధ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# “కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం! అవినీతి ఘనం - కాకాణి”






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పొదలకూరు మండల కేంద్రంలో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు మరియు జిల్లా వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. పొదలకూరు అభివృద్ధి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో తప్ప, కూటమి ప్రభుత్వంలో వెతికినా కనిపించడం లేదు. పొదలకూరు మండలంలో వేలాది కుటుంబాలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్ళు నిర్మించాం. పొదలకూరు పట్టణంలో ప్రధాన రహదారి నిర్మాణంతోపాటు, గ్రామాల గుండా వెళ్లే రహదారులన్నిటిలో సిమెంట్ రోడ్లు నిర్మించాం. రహదారులు లేని గ్రామాలకు నిధులు మంజూరు చేసి నూతన రహదారులు నిర్మించాం. కూటమి పాలనలో అభివృద్ధి “శూన్యం” అవినీతి ఘనం అన్న చందంగా తయారైంది. పొదలకూరు మండలంలోని గ్రామాలలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాం. పొదలకూరు మండల కేంద్రంతో పాటు, మండలంలోని గ్రామాలన్నిటిలో కాలనీలతో సహా, సిమెంట్ రోడ్లు వేయించాం. గ్రామాలలో అవసరాన్ని, అవకాశాన్ని బట్టి సైడ్ డ్రైన్లు నిర్మించాం. పొదలకూరు మండలం కేంద్రంతో పాటు, ఆనుకుని ఉన్న గ్రామాలకు కూడా, కండలేరు జలాశయం ద్వారా కొత్త పైప్ లైన్ వేసి సమృద్ధిగా సాగు సాగునీరు అందించాం. కండలేరు ఎడమ కాలువకు లైనింగ్ నిర్మాణం చేపట్టి రైతులకు సజావుగా, సాఫీగా, సాగునీరు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూముల యజమానులకు పట్టాలందించి, యాజమాన్య హక్కులు కల్పించాం. వేలాది మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల కాలనీలు నిర్మించాం. రైతులకు ప్రజలకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది రానివ్వకుండా, ఇళ్ల మీద పోతున్న కరెంట్ తీగలు తొలగించడంతో పాటు, నూతన లైన్‌లు, కొత్త సబ్ స్టేషన్లు, మంజూరు చేయించాం. కోట్లాది రూపాయలు వెచ్చించి, సర్వేపల్లి నియోజకవర్గంలో, ప్రధాన రహదారులను పునర్ నిర్మించాం. గ్రామాలలో భక్తులు కోరుకున్న విధంగా దేవాలయాల నిర్మాణానికి, నిధులు మంజూరు చేయించాం. పేద గిరిజనులకు ప్రభుత్వ సహాయానికి అదనంగా, 15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించాం. జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం, పరవళ్ళు తొక్కితే, కూటమి పాలనలో అవినీతి కొత్త పుంతలు తొక్కుతుంది. ఇరిగేషన్ పేరిట దొంగ బిల్లులు చేసుకుని, భోం చేయడం తప్ప, రైతు సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. రైతులకు యూరియా కూడా అందించలేని అసమర్థ ప్రభుత్వంగా, కూటమి ప్రభుత్వం మిగిలిపోతుంది. పొదలకూరు చరిత్రలో ఎన్నడు లేనివిధంగా, లేఔట్ యజమానులను బెదిరించి, కోట్లాది రూపాయలు గుంజుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణంలో అవినీతి జరిగిందని, అబద్ధపు ప్రచారాలతో కాంట్రాక్టర్లను బెదిరించి, డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించారు. ఇళ్ల నిర్మాణంలో అవినీతి జరిగినట్లు, మీరు చేసిన ఆరోపణలు, నిరూపించేందుకు సిద్ధమా అని ఛాలెంజ్ విసురుతున్నా! ఇరిగేషన్ పనులపై 2019 వ సంవత్సరం నుండి ఇప్పటివరకు జరిగిన అవకతవకలపై “సిబిఐ” విచారణకు సిద్ధమా అని సవాల్ విసురుతున్నా! గ్రామాలలో చిచ్చులు పెట్టడం, పోలీస్ కేసులు పెట్టించడం, తప్ప మరొక పని లేకుండా పోయింది. అక్రమ కేసులు నమోదు చేస్తున్న పోలీస్‌లతోపాటు, తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న వారి పైన కూడా, విచారణ చేపట్టి




ఎలాంటి చర్యలు తీసుకుంటామో, భవిష్యత్తులో ప్రజలే చూస్తారు. మాపై ఆరోపణలు చేసి పలాయనం చిత్తగించడం కాకుండా, దమ్ము, ధైర్యం, ఉంటే విచారణ జరిపించి, వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందిగా, డిమాండ్ చేస్తున్నాం! అధికారులను గుప్పెట్లో పెట్టుకొని, లేనిపోని అవాస్తవాలు ప్రచారం చేయడం కాకుండా, ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచే ధైర్యం ఉందా అని ప్రశ్నిస్తున్నాం! నెల్లూరు జిల్లా రైతాంగానికి వరప్రదాయని అయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చంద్రబాబు నిర్వీర్యం చేశాడు. చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే తన మాట మన్నించి, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపివేశాడంటూ రేవంత్ రెడ్డి, తెలంగాణ అసెంబ్లీలో మాట్లాడిన విషయంపై చంద్రబాబు ఇంతవరకు వివరణ ఇవ్వలేదు. చంద్రబాబు పరిస్థితి గమనిస్తే, రేవంత్ రెడ్డి మాటలు విని రాష్ట్ర రైతాంగానికి ద్రోహం చేస్తున్నట్టు స్పష్టమైనది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సాధించి, సోమశిల, కండలేరు జలాశయాలకి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రైతులతో కలిసి పోరాడుతాం. జగనన్న నాయకత్వంలో పోలీసులు మాపై ఎన్ని కేసులు బనాయించినా, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం సాధనే ధ్యేయంగా, కార్యాచరణ సిద్ధం చేసుకొని, రైతుల భవిష్యత్తు కోసం ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాం. కూటమి పాలనతో విసిగి, వేసారి పోయిన ప్రజలు, మరలా జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేందుకు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, మరల తిరిగి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయం. కూటమి ప్రభుత్వంలో నిద్ర లేచినప్పటి నుండి ఎంత మేర అవినీతికి పాల్పడి దోచుకోగలమా అన్న విషయంపై దృష్టి పెట్టడం తప్ప, ప్రజల అభివృద్ధి విషయంలో కానీ, సమస్యల పరిష్కారంపై ధ్యాస పెట్టే, పరిస్థితులు కనిపించడం లేదు. అనారోగ్యానికి గురైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊకోటి లక్ష్మి నారాయణని పరామర్శించి, పొదలకూరు వార్డు మెంబర్ గుంటి భాస్కర్ తండ్రి వెంకట రమణయ్య, అన్న పెంచలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించిన కాకాణి.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan